

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 24 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :21 పేజీలు : 4 వెల : రూ 3-00


## భారత్‌లో అక్టోబర్‌లో థర్డ్‌వేవ్

### పీఎంవోకు నివేదిక అందజేసిన ఎన్ఐడీఎం
### పిల్లలపైనే అధిక ప్రభావం.. మెరుగైన వైద్యం కోసం సన్నద్ధం కావాలి: ఎన్ఐడీఎం



న్యూఢిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి కొనసాగుతూనే ఉంది. కొద్ది రోజుల నుంచి భారత్‌లో సెకండ్ వేవ్ ఉధృతి కొద్దిగా తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నమోదవుతున్న కేసుల్లో భారీ తగ్గుదల కనిపిస్తుంది. అయితే కరోనా ముప్పు ఇంకా తొలగిపోలేదని.. త్వరలో థర్డ్ వేవ్ రానుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో భారత్‌లో అక్టోబర్‌లో కోవిడ్ థర్డ్ వేవ్ వచ్చే అవకాశం ఉన్నట్లు పీఎంవోకు జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ(ఎన్ఐడీఎం) నిపుణుల కమిటీ నివేదిక అందజేసింది. ఇక థర్డ్‌వేవ్‌లో పిల్లలపై ఎక్కువ ప్రభావం ఉ ంటుందని ఎన్ఐడీఎం హెచ్చరించింది. థర్డ్‌వేవ్‌ను దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్యం కోసం సన్నద్ధం కావాలని ఎన్ఐడీఎం సూచించింది. థర్డ్‌వేవ్ సమయంలో ప్రస్తుతం ఉన్న వైద్య సదుపాయాలు సరిపోవని నివేదికలో వెల్లడించారు. ఇక చిన్న పిల్లలకు వైద్యం కోసం సిబ్బందిని పెంచాలని సూచించారు. వైద్య పరికరాలు, వెంటిలేటర్లు, అంబులెన్స్‌ల సంఖ్యను పెంచాలని తెలిపారు. దేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 82 శాతం శిశు వైద్యుల కొరత ఉండగా.. దేశవ్యాప్తంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 63 శాతం ఖాళీలు ఉ న్నట్లు ఎన్ఐడీఎం నివేదిక తెలిపింది. థర్డ్‌వేవ్ ముప్పును దృష్టిలో పెట్టుకుని వైద్యుల కొరత, ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాల్సిందిగా సూచించింది.

## పేదలందరికీ ఇల్లు, ఇంటి స్థలాల పంపిణీపై సీఎం జగన్ సమీక్ష



అమరావతి : పేదలందరికీ ఇల్లు, ఇంటి స్థలాల పంపిణీపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలు, మౌలిక వసతులపై సమీక్షించారు. మంత్రులు ధర్మాన కృష్ణదాస్, బొత్స సత్యనారాయణ, శ్రీరంగనాథరాజు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ... "నిర్మాణ సామగ్రిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. విద్యుదీకరణకు అవసరమైన సామాగ్రి కూడా అందుబాటులో ఉంచాలి. ఇళ్లు కట్టి ఇచ్చే పనులు అక్టోబర్ 25 నుంచి ప్రారంభం కావాలి. జగనన్న కాలనీల్లో ఇంటర్నెట్ సదుపాయం ఉండాలి. 90 రోజుల్లోగా అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి" అని అన్నారు. టిడ్కో ఇళ్లపైనా సీఎం సమీక్ష సందర్భంగా.. ఫేజ్-1లో భాగంగా 85,888 ఇళ్ల పనులు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. ఈ కాలనీల్లో మౌలిక వసతుల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, డిసెంబర్ 2021 నాటికల్లా ఈ ఇళ్లు లబ్ధిదారులకు అందిస్తామని చెప్పారు. పట్టణాలు, నగరాల్లోని మధ్యతరగతి ప్రజలకు సరసమైన ధరలకే ప్లాట్లు పథకాన్ని కూడా ముఖ్యమంత్రి సమీక్షించారు. దాదాపు 3.94 లక్షల ప్లాట్లకు డిమాండ్ ఉందని అధికారులు తెలిపారు. 150, 200, 250 గజాల విస్తీర్ణంలో ప్లాట్లు.. వివిధ రకాలుగా భూముల గుర్తింపు, సమీకరణ చేస్తున్నామని తెలిపారు. విజయదశమి నాటికి కార్యాచరణ సిద్ధంచేసి అమలు తేదీలు ప్రకటించాలని సీఎం ఆదేశించారు. వైఎస్సార్ జగనన్న కాలనీలు, టిడ్కో ఇళ్లు, ఎంఐజీ లే అవుట్లు, 90 రోజుల్లో ఇళ్లపట్టాల కార్యక్రమాలపై సీఎం వైఎస్ జగన్ సమీక్షించారు. ఇళ్ల నిర్మాణ సామగ్రికి రివర్స్ టెండరింగ్ ద్వారా రూ. 5,120 కోట్లు ఆదా చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణ సామగ్రికి దాదాపుగా రూ. 32 వేలు ఆదా అయ్యిందన్న అధికారులు వివరించారు. లబ్దిదారుల కోరిక మేరకు వారికీ నిర్మాణ సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు అధికారులు దీనికోసం ప్రత్యేక యాప్ రూపొందించామని పేర్కొన్నారు. విద్యుదీకరణకు అవసరమైన నాణ్యమైన సామగ్రిని కూడా లబ్ధిదారులకు అందుబాటులో ఉంచేలా ప్రయత్నాలు చేయాలని సీఎం జగన్ తెలిపారు. ఆప్షన్ 3 కింద, అంటే ప్రభుత్వమే కట్టించి ఇవ్వాలన్న ఆప్షన్ ఎంపిక చేసుకున్న వారికి ఇళ్లు కట్టించి ఇచ్చే పనులు అక్టోబరు 25 నుంచి ప్రారంభం కావాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈలోగా అందుకు అవసరమైన సన్నాహకాలను పూర్తిచేయాలని స్పష్టం చేశారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. కాలనీల్లో ఇంటర్నెట్ సదుపాయం కూడా ఉండాలని స్పష్టం చేశారు. 90 రోజుల్లోగా ఇళ్లపట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. పట్టణాలు, నగరాల్లోని మధ్యతరగతి ప్రజలకు సరసమైన ధరలకే ప్లాట్లు పథకాన్ని కూడా సీఎం సమీక్షించారు.

## ఏపీ ప్రభుత్వంపై మండిపడ్డ హైకోర్టు




అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంపై ఏపీ హైకోర్టు మరోసారి మండిపడింది. నరేగా పనులకు బిల్లులు చెల్లించకపోవడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు వారాల్లో బిల్లులు చెల్లించి హైకోర్టుకు నివేదిక ఇవ్వాలని మధ్యంతర ఆదేశాలిచ్చింది. బిల్లులు చెల్లించకపోవడం పిటిషనర్ల జీవించే హక్కును హరించడమేనని న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ వ్యాఖ్యానించారు. రెండు వారాల్లోపు 500 మంది పిటిషనర్లకు డబ్బు చెల్లించి తీరాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. చెల్లించాల్సిన డబ్బుకు వడ్డీ, 20 శాతం మినహాయింపును ప్రధాన పిటిషన్ విచారణలో పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కు అంటే గౌరవంతో జీవించడమని కోర్టు వ్యాఖ్యానించింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించమని ఇప్పటికే చెప్పినప్పటికీ.. ప్రభుత్వం ఖాతరు చేయలేదని న్యాయస్థానం తప్పుబట్టింది. కేంద్రం నరేగా పనులకు నిధులు చెల్లించామని తమ వద్ద బకాయిలు లేవని అఫిడవిట్‌లో చెప్పిందని కోర్టు పేర్కొంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం డబ్బురాలేదని చెబుతోందని, ఈ రెండు పరస్పర విరుద్ధమైన అంశాలని కోర్టు వ్యాఖ్యానించింది. గతంలో బిల్లులు చెల్లిస్తామని అడ్వకేట్ జనరల్ హామీ ఇచ్చినప్పటికీ చెల్లించకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది.

## నాగరికత, సంస్కృతులకు మూలం జానపద విజ్ఞానమే: వెంకయ్యనాయుడు



బెంగళూరు : ఏ దేశ నాగరికత, సంస్కృతికైనా ఆ దేశంలోని జానపద విజ్ఞానవే మూలమని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. భాష, కళలు, చేతిపనులు, పనిముట్లు, దుస్తులు, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, వైద్యం, పంటలు, సంగీతం, నృత్యం, ఆటలు, హావభావాలన్నింటి సమాహారమే జానపద విజ్ఞానమని తెలిపారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన పలువురు జానపద కళాకారులు అంతర్జాల వేదిక ద్వారా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ప్రసంగించారు. జానపద సంపద లేకుండా భాషాభివృద్ధి, సాంస్కృతికాభివృద్ధి జరుగవని, ఈ రెండింటి పుట్టుక జానపదం నుంచే మొదలైందన్నారు. అమ్మ పాడే లాలిపాటలు, అలసట తెలియకుండా పాడుకునే శ్రామికుల గీతాలు, జీవితాన్ని తెలియజేసే ఆధ్యాత్మిక తత్త్వాలు.. ఇలా ఏ సాహిత్యాన్ని చూసినా జానపద వాసన స్పష్టంగా కనబడుతున్న చెప్పారు. పల్లె ప్రజల శ్రమను మరిపించేందుకు పుట్టిన జానప దాలు.. తదనంతర కాలంలో సామాజిక రుగ్మ తల మీద పోరాటానికి ఎంతగానో ఉపయుక్తమ య్యాయని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేయడంలో జానపదాలు పాత్ర కీలకపాత్ర పోషించాయని గుర్తుచేశారు. హంగు, ఆర్భాటం లేకుండా సరళమైన, చిన్న చిన్న పదాలతో లోతైన అంశాలను సైతం పండితుల నుంచి పామరుల వరకు సమాజంలోని ప్రతి ఒక్కరికీ స్పష్టంగా తెలియజేయడమే జానపదం గొప్పదనమన్నారు. ఇదే వేదిక నుంచి ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 150వ జయంతి సందర్భంగా వెంకయ్యనాయుడు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జానపద గాయకుడు దామోదరం గణపతి రావు, నారాయణరావు, దామోదర జానపదం, డాక్టర్ గుడిసేవ విష్ణుప్రసాద్, జానపద పరిశోధకులు డాక్టర్ సగిలి సుధారాణి, జానపద గాయకుడు డాక్టర్ లింగ శ్రీనివాస్‌తోపాటు దేశవిదేశాలకు చెందిన జానపద కళాకారులు, జానపద కళాభిమానులు అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.

## ఆఫ్ఘన్ పరిణామాలపై పార్టీలకు బ్రీఫింగ్... మోదీ ఆదేశం



న్యూఢిల్లీ: అఫ్ఘన్ పరిణాలపై రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు సంక్షిప్తంగా వివరించాలని విదేశాంగ శాఖను ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశించారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ సోమవారంనాడు ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన తక్కిన వివరాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలియజేస్తారని ఆయన చెప్పారు. కాబూల్ తాలిబాన్ గుప్పిట్లోకి వెళ్లిన నేపథ్యంలో అక్కడి భారత పౌరులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకువస్తున్న నేపథ్యంలో మోదీ ఈ తాజా ఆదేశాలిచ్చారు. రాబోయే రోజుల్లో అఫ్ఘనిస్థాన్ నుంతి భారతీయులను సురక్షితంగా తరలించేందుకు సంబంధింత అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఈనెల 17న జాతీయ భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రధాని మోదీ ఆదేశాలిచ్చారు. సురక్షితంగా అందర్నీ అఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఈఏ ఒక ప్రకటనలో పేర్కొంది. కాబూల్ విమానాశ్రయం నుంచి ఆపరేషనల్ స్టాటస్ అనేది ఈ విషయంలో ప్రధాన సవాలని తెలిపింది. కాగా, ఆదివారంనాడు భారత ప్రభుత్వం మూడు వేర్వేరు విమానాల్లో సుమారు 400 మందిని వెనక్కి తీసుకువచ్చింది.

## ఏపీలో కొత్తగా 1,002 కరోనా కేసులు

అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఏపీలో కొత్తగా 1,002 కరోనా కేసులు నమోదయ్యాయి.



కరోనాతో 12 మంది మరణించారు. ఏపీలో మొత్తం 20,03,342 కరోనా కేసులు ఉన్నాయి. కరోనాతో మొత్తం 13,735 మంది మృతి చెందారు. ఏపీలో 14,159 యాక్టివ్ కేసులు ఉన్నాయి. 19,75,448 మంది ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఏపీలో గత 24 గంటల్లో 47,972 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు. కరోనాతో చిత్తూరు జిల్లాలో నలుగురు, కృష్ణా జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. ఏపీలో కరోనా నుంచి 1,508 మంది బాధితులు కోలుకున్నారు.

## కరోనా నియంత్రణలో జగన్ విఫలం: చంద్రబాబు

అమరావతి: కరోనా నియంత్రణలో జగన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని టీడీపీ అధినేత చంద్రబాబు దుయ్యబట్టారు. కరోనా సమయంలోనూ పన్నులు, ధరలు పెంచి ప్రజలపై భారం మోపారని



విమర్శించారు. అప్పు తెచ్చిన రూ. 2 లక్షల కోట్లు ఏం చేశారు? అని చంద్రబాబు ప్రశ్నించారు. అవినీతి, దుబారాతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం వచ్చిందన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి చట్టబద్ధంగా రావాల్సిన నిధులు అందడం లేదని తప్పుబట్టారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌రెడ్డి మోసాలను రెండేళ్లలోనే ప్రజలు గ్రహించారని, నీలిమీడియా అబద్ధపు ప్రచారం నుంచి ప్రజలు బయటపడుతున్నారని తెలిపారు.

## పోలీసుల మరణం తీరని లోటు: డీజీపీ

అమరావతి: శ్రీకాకుళం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఏఆర్ పోలీసులు మృతి చెందడం తీవ్రగ్భ్రాంతికి గురి చేసిందని రాష్ట్ర డీజీపీ కార్యాలయం తెలిపింది. కలకత్తాలో ప్రాణాలు కోల్పోయిన ఆర్మీ జవాన్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏఆర్ ఎస్ఐ, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్లు, ఒక కానిస్టేబుల్ ప్రాణాలు కోల్పోయారు. తక్షణమే ఘటనా స్థలాన్ని చేరుకొని, వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని రేంజి డీఐజీ, జిల్లా ఎస్పీని డీజీపీ గౌతమ్



సవాంగ్ ఆదేశించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వివరాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. విధి నిర్వహణలో నలుగురు పోలీసులు మరణం చెందడం పోలీస్ కుటుంబానికి తీరని లోటని డీజీపీ గౌతమ్ సవాంగ్ అన్నారు. మరణించిన పోలీస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని డీజీపీ తెలిపారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ వారి కుటుంబలకు అండగా ఉంటుందని డీజీపీ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పలాస మండలం సుమ్మాదేవి రైల్వే గేటు దగ్గర జీపు టైరు పేలడంతో నలుగురు ఎస్కార్ట్ పోలీసులు దుర్మరణం చెందారు. వారిని ఏఆర్ కానిస్టేబుళ్లుగా గుర్తించారు. వారు ఓ ఆర్మీ జవాను అంత్యక్రియల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న వాహనం టైరు పేలి, అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్ఐ కృష్ణం నాయుడు, హెడ్ కానిస్టేబుల్స్ జనార్ధనరావు, ఆంటోనీ, కానిస్టేబుల్ బాబూరావులు అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన ప్రదేశానికి చేరుకున్న స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి: సజ్జల

అమరావతి: బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం నిర్వహించిన జంగం కార్పొరేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శైవ క్షేత్రాల్లో జంగం కులం వారిని పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.



# సంపాదకీయం

మంగళవారం 24 ఆగస్టు 2021

## ప్రతిపక్షాల ఐక్యత అంత ఈజీకాదు...

ప్రతిపక్షాలు పోరాటానికి కదులుతున్నాయి. మొన్నటివరకూ పార్లమెంటులో చాటుకున్న ఐక్యతను రాజకీయ సంఘటితత్వానికి పెట్టుబడిగా వాడుకునేందుకు సన్నద్ధం అవుతున్నాయి. అన్నిపార్టీలకు కావాల్సింది ఒకటే. మోడీ నాయకత్వంలోని బీజేపీని ఓడించాలి. అదొక తప్పనిసరి అవసరంగా మారిపోయింది. అందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఏకాభిప్రాయం మాత్రం లేదు. అందుకే ప్రస్తుతానికి రాజకీయ పొత్తులపై ముందుకు వెళ్లేందుకు ఇంకా తయారు కాలేదు. ఉద్యమానికి సూత్రప్రాయ ఏకాభిప్రాయం నెలకొంది. దేశంలోని 19 ప్రధాన పార్టీలు ఆందోళనల పర్వమైన అజెండాను ఖరారు చేసుకున్నాయి. పెద్దపార్టీలుగా ముద్రపడిన మరో అరడజను పార్టీలు అటు బీజేపీకి, ఇటు కాంగ్రెసు సారథ్యంలోని ఆందోళనల కూటమికి సమదూరంగా ఉండిపోయాయి. సోనియా నాయకత్వంలోని విపక్షాల ఆన్ లైన్ వర్చువల్ సమావేశం సాధించిన విజయం ఇదే. అయితే ఇంకా ఎన్నికల సమయానికి వేయాల్సిన అడుగులు చాలానే మిగిలి ఉన్నాయి. అందుకే ముందుగా పోరాటం మొదలు పెట్టాలి. ఆ తర్వాతనే ఐక్య ఎన్నికల సంఘటనకు ప్రయత్నించాలనే భావన వ్యక్తమవుతోంది. పోరాటానికి– పొత్తుకు మధ్య ఇంకా అంతరం కొనసాగుతూనే ఉంది.కూటమి కట్టాలనుకుంటున్న పార్టీల్లో కాంగ్రెసు తర్వాత పెద్ద పార్టీ తృణమూల్ కాంగ్రెసు. ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ ఇంకా స్పష్టమైన వైఖరి తీసుకోలేకపోతున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో కాంగ్రెసు, వామపక్షాల కూటమి పట్ల రాజకీయంగా ఆమె నిర్ణయం అనిశ్చితంగా ఉంది. బీజేపీని జాతీయ స్థాయిలో ఎదిరించాలనే దృఢసంకల్పం కనిపిస్తోంది. కానీ సొంత రాష్ట్రంలో వామపక్షాలు, కాంగ్రెసును చేరదీసేందుకు సిద్ధపడటం లేదు. బీజేపీ పశ్చిమబెంగాల్ లో బలం పుంజుకుంటుందేమోననే భయం ఆమెను వెన్నాడుతోంది. బీజేపీని వ్యతిరేకించే ఓట్లన్నీ సంఘటితం కావడం తోనే మమతకు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అంతటి మెజార్టీ దక్కింది. ఆ ఓట్లను ఇతర పార్టీలతో కలిసి పంచుకోవడం ఆమెకు ఇష్టం లేదు. పశ్చిమబెంగాల్ సహా దేశవ్యాప్తంగా బీజేపీ పరువు తీసే ఉద్యమాలు చేయాలని కోరుకుంటోందామె. ఇందుకు రాజకీయ సంఘటన కావాలని ప్రయత్నిస్తోంది. పొత్తుల విషయం అప్పుడే వద్దంటూ మెలిక పెడుతోంది.ఫెగాసిస్ రహస్య నిఘా, వ్యవసాయ చట్టాలు, ధరల పెరుగుదల పోరాటానికి ప్రధానాంశాలుగా ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. వీటిపై ఎన్సీపీ అధినేత శరద్ పవార్ విభేదిస్తున్నారు. సోనియా, మమత వంటి వారి అజెండాలో పెగాసిస్, వ్యవసాయ చట్టాలు మొదటి ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఫెగాసిస్ ఆందోళన ప్రజలలో కదలిక తెచ్చే అవకాశం లేదనేది పవార్ అభిప్రాయం. అదే విధంగా వ్యవసాయ చట్టాలపై దేశవ్యాప్తంగా ఒకే రకమైన అభిప్రాయం లేదు. కొన్ని రాష్ట్రాల్లో రైతుసంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు ఆ చట్టాలను స్వాగతిస్తున్నాయి. ఇది ప్రతిపక్షాలకు చేదు అనుభవం మిగల్చవచ్చు. కామన్ అజెండాగా ధరల పెరుగుదలను తీసుకోవాలనేది పవార్ అభిప్రాయం. అందువల్ల ప్రతి ఒక్కరిలోనూ కదలిక వస్తుందంటున్నారు.కేరళలో మాత్రం ఆధిపత్యం చెలాయిస్తూ దేశవ్యాప్తంగా నామ్ కే వాస్తే జాతీయ పార్టీలుగా మిగిలిన వామపక్షాలు ఆటలో అరటిపండుగా మారిపోయాయి. ఏ కూటమి వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. అయితే కార్మికసంఘాలలో ప్రాధాన్యం, గత వైభవం కారణంగా వామపక్షాలకు మొహమాటపు ఆహ్వానాలు అందుతున్నాయి. బీజేపీపై గుడ్డి వ్యతిరేకత మినహా కమ్యూనిస్టు పార్టీలకు స్పష్టమైన అజెండా లేదు. మమతా బెనర్జీ ఇప్పటికే పశ్చిమబెంగాల్ లో చావు దెబ్బతీశారు. కేరళ మినహా మిగిలిన ఏ రాష్ట్రంలోనూ సొంతంగా సీట్లు గెలిచే సామర్థ్యం లేదు. ఈ పరిస్థితుల్లో కమ్యూనిస్టు అజెండాను కాంగ్రెసు అందిపుచ్చుకోవాలని ఆ పార్టీల నాయకులు సూచిస్తున్నారు. అధికారపు పోటీ తప్ప పాలన విధానాలలో కాంగ్రెసుకు, బీజేపీకి పెద్దగా తేడా లేదు. అయినా కమ్యూనిస్టు నేతలు దింపుడు కళ్లెం ఆశతో కాంగ్రెసును పట్టుకుని వేలాడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కమలం పార్టీ ఓడిపోతుందనే కలతోనే కాంగ్రెసుకు వత్తాసునిస్తున్నారు. విధానపరమైన పోరాట అజెండా లేదు.జాతీయంగా కీలక ప్రాధాన్యమున్న ముగ్గురు నాయకులు ప్రతిపక్ష కూటమికి దూరంగా ఉండటం చర్చనీయమవుతోంది. దేశవ్యాప్తంగా దళిత సామాజిక వర్గాలలో మాయావతికి ఆదరణ ఉంది. పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ లో కీలకపార్టీగా బహుజనసమాజ్ కొనసాగుతోంది. ఇక అదే రాష్ట్రం నుంచి సమాజ్ వాదీ పార్టీ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రధానప్రత్యర్థిగా తలపడబోతోంది. ఈ రెండు పార్టీలు విపక్ష కూటమి ని పట్టించుకోవడం లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త తరహా రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలుస్తోంది. కాంగ్రెసు, బీజేపీ సారథ్యంలోని పార్టీలన్నీ ఒకటే అన్నది అరవింద్ కేజ్రీవాల్ నమ్మకం. ఆయన కూడా ప్రతిపక్ష రాజకీయాలను విశ్వసించడం లేదు. తమ వ్యక్తిగత, సొంత రాష్ట్రాల కారణాలతో వైసీపీ, టీఆర్ఎస్, బీజేడీ వంటి పార్టీలు కూటములను దూరం పెడుతున్నాయి. వీటిని కలుపుకునిపోకుండా ప్రతిపక్షాల పోరాటానికి సాధికారత సాధ్యం కాదు. అవి తటస్థ పాత్ర పోషిస్తే కచ్చితమైన ఫలితం రాకపోవచ్చని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

## ఉత్తరాంధ్ర నుంచి చంద్రబాబు పోటీ..?



విశాఖపట్టణం, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)వచ్చే ఎన్నికల్లో గెలుపు టీడీపీకి అత్యవసరం. అంతే కాదు. చంద్రబాబు లాంటి రాజకీయ నాయకునికి బహుశా అవే చివరి ఎన్నికలు కూడా. వరసపెట్టి వైసీపీ మరోసారి గెలిచింది అంటే ఇక టీడీపీ దుకాణాన్ని బంద్ చేసుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో చంద్రబాబు అనేక రకాలుగా ఆలోచనలు చేస్తున్నారుట. ప్రాంతాలు, కులాలు, మతాలు, పొత్తులు, ఎత్తులు ఇలా ఎన్నో విషయాల్లో చంద్రబాబు మదింపు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని టాక్. టీడీపీకి ఉత్తరాంధ్రా జిల్లాలు పెట్టని కోటలు. అక్కడ మళ్ళీ విజయఢంకా మోగించకపోతే మాత్రం అధికారంలోకి రావడం కల్లగానే మిగిలిపోతుంది.అమరావతి అంటూ చంద్రబాబు కలవరిస్తున్నారు. ఇది వైసీపీ చేస్తూ వస్తున్న ప్రచారం. చంద్రబాబు కూడా మన రాజధాని అమరావతి అనే అంటూ వస్తున్నారు. దీంతో విశాఖ పాలనారాజధానికి ఆయన వ్యతిరేకం అని వైసీపీ ఇప్పటికే ప్రచారం చేసింది. ఆ నినాదంతోనే జీవీఎంసీ ఎన్నికలలో వైసీపీ ఎక్కువ సీట్లు గెలుచుకుని మేయర్ పీఠాన్ని పట్టేసింది. రానున్న రోజుల్లో జగన్ విశాఖకు మకాం మార్చితే ఆ ఇంపాక్ట్ ఇంకా ఎక్కువగా ఉంటుంది. దాంతో విశాఖకు టీడీపీ వ్యతిరేకం అన్న ముద్రను పోగొట్టుకోవాలని చంద్రబాబు గట్టిగా భావిస్తున్నారుట.వచ్చే ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి లోకేష్ పోటీ చేస్తారు అన్న ప్రచారం ఇప్పటిదాకా వినిపించింది. అయితే చంద్రబాబే ఇక్కడ పోటీ చేస్తారు అన్నది తాజా ఖబర్. ఈ మధ్య భీమిలీ ఇంచార్జి కోరాడ రాజబాబు అమరావతిలో చంద్రబాబుని కలసినపుడు ఆయన భీమిలీని ఎట్టి పరిస్థితుల్లో టీడీపీని కంచుకోటగా మార్చాలని సూచించారుట. అంతే కాదు విశాఖ మీద ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాట్లుగా తెలిపారుట. దాంతో చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తారు అన్న చర్చ అయితే ఉందిపుడు. చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తే టీడీపీ కథే వేరుగా ఉంటుంది అంటున్నారు.టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీయార్ 1994 ఎన్నికల వేళ భీమిలీ నుంచి పోటీ చేస్తారని వెల్లువలా ప్రచారం సాగింది. చివరి నిముషంలో అన్న గారు తన నిర్ణయం మార్చుకుని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి పోటీ చేశారు. నాడు ఎన్టీయార్ ఉత్తరాంధ్రా జిల్లాలలో టీడీపీకి దన్నుగా ఉంటూ పోటీ చేసి భారీ సక్సెస్ సొంతం చేసుకున్నారు. ఇపుడు అదే ఫార్ములాను చంద్రబాబు కూడా అమలు చేయబోతున్నారు అంటున్నారు. అంటే మూడు దశాబ్దాల తరువాత అల్లుడు కూడా ఉత్తరాంధ్రానే ఎంచుకుంటారు అంటున్నారు. చంద్రబాబు భీమిలీ నుంచి పోటీ చేస్తే ఆ ప్రభావం కచ్చితంగా మూడు జిల్లాల మీద ఉంటుందని, అదే విధంగా తాము విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్న సంకేతాన్ని కూడా బలంగా ఇస్తుందని అంటున్నారు. ఇక వైసీపీ రాజకీయ దూకుడుకు కూడా అలా అడ్డుకట్ట వేస్తూ అత్యధిక సీట్లు గెలుచుకోవచ్చు అని కూడా ఆలోచిస్తున్నారుట. మరి చూడాలి ఈ ప్రచారం కనుక నిజం అయితే మాత్రం విశాఖ కేంద్రంగానే ఏపీ రాజకీయం హోరెత్తడం ఖాయం.

## వరుస ఆడియో లీకులు..

విశాఖపట్టణం, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)రాజకీయాలల్లో రాళ్ళు ఎటు నుంచి దూసుకువస్తాయో ఎవరికీ తెలియదు. అలా వచ్చినవి అటూ ఇటూ తగిలి ఊరుకుంటాయి అనుకుంటే పొరపాటే. చివరికి అవి నేరుగా అధినాయకుడికే తగులుతాయి. దాని వల్ల అతి పెద్ద డేంజర్ కూడా పార్టీకి జరుగుతుంది. మరి ఈ విషయం గ్రహించారో లేదో కానీ వైసీపీ నేతల ఆడియో లీకుల మీద జగన్ పెద్దగా సీరియస్ గా ఉన్నట్లుగా లేదు. ఏపీలో ఇపుడు కొత్త రకం రాజకీయం సాగుతోంది. వైసీపీ సర్కార్ ఫెయిల్యూర్స్ అని ఒక వైపు చర్చకు పెడుతున్న విపక్షాల నాయకులు వాటితో పాటుగా రాసలీలల ఆడియో లీకులను కూడా వాడుకుంటూ ఏకంగా రాష్ట్రంలో మహిళా భద్రతనే ప్రశ్నిస్తున్నారుఒకటి జరిగితే పొరపాటు అనుకోవచ్చు. కానీ అదే అలవాటుగా మారితే మాత్రం ఇక ఉపేక్షించి లాభం లేదు. నిజానికి గత ఏడాది థర్టీ యియర్స్ ఇండస్ట్రీ పృథ్వీ విషయంలో ఇలా జరిగినపుడే జగన్ పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాల్సింది. కానీ ఆయన్ని పక్కన పెట్టేశారు. తరువాత సీనియర్ ఎమ్మెల్యే అంబటి రాంబాబు బుక్ అయ్యారు. ఇపుడు విశాఖ మంత్రి అవంతి శ్రీనివాస్ పేరు బయటకు వచ్చింది. దాంతో ఇది జగన్ సర్కార్ ప్రతిష్టకే మచ్చగా మారుతోంది. దాంతో ప్రభుత్వం దీని మీద గట్టిగానే రియాక్ట్ అవాలన్న మాట అయితే వినిపిస్తోంది.వైసీపీ సర్కార్ కి, పార్టీకి జగనే నాయకుడు. అందువల్ల వైసీపీలో ఏ ఘటన జరిగినా చుట్టుకునేది మాత్రం జగన్ కే అన్నది తెలిసిందే. ఆయన అయితే పూర్తి సైలెంట్ గా ఉంటారు. ఆయనకు తన మనుషుల మీద నమ్మకం ఉండవచ్చు కాక. కానీ దీన్ని ఆసరాగా చేసుకుని విపక్షాలు సోషల్ మీడియాలో ఒక్క లెక్కన ఆట ఆడేసుకుంటున్నాయి. దాని వల్ల బురద వచ్చి మొత్తం వైసీపీ మీదనే పడుతోంది మరి జగన్ యాక్షన్ అన్నది ఏదైనా తీసుకోకపోతే ఇంకా చాలా ఆడియో లీకులు బయటకు వస్తాయని కూడా అనుమానిస్తున్నారు.ఇక జనాలు సాధారణంగా సున్నితమైన విషయాల్లో గట్టిగానే ఉంటారు. రాజకీయాలు వేరు, ఇలాంటివి వేరు. నేతల అవినీతి ఆరోపణలు ఎన్ని వచ్చినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. ఎందుకంటే ఎవరు మాత్రం పతిత్తులు అన్నది జనం భావన. కానీ మహిళలతో వైసీపీ నేతల రాసలీలలు అంటూ వస్తున్న ఆడియోలు లీకుల ప్రచారం అయితే మాత్రం అది పార్టీకే పెద్ద దెబ్బగా మారుతుంది. మరో వైపు దిశ చట్టం మహిళా భద్రత గురించి గొప్పగా చెప్పుకుంటున్న వైసీపీకి ఈ పరిణామాలు అసలు మింగుడు పడకపోవచ్చు. సొంత పార్టీ వారే ఇలా చేస్తున్నారా అన్న డౌట్లు జనాల్లోకి వెళ్తే ఏం చెప్పినా బూమరాంగ్ అవుతుంది. అందువల్ల ఈ ఆడియో లీకుల వెనక ఎవరు ఉన్నారు లెక్క తేల్చి బాధ్యుల మీద సీరియస్ గా యాక్షన్ తీసుకోవాల్సిన కర్తవ్యం జగన్ మీదనే ఉంది అంటున్నారు. ఆయన కనుక ఉపేక్షిస్తే మాత్రం చిరిగి చేట అయ్యేది చివరికి జగన్ ఇమేజే సుమా.

## వైసీపీ గూటికి గోరంట్ల అనుచరులు

రాజమండ్రి, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)రాజమండ్రి లో టిడిపి అంటే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తప్ప మరో పేరు వినపడేది కాదు. గోరంట్ల అంటే తెలుగుదేశం అనే అంతా భావించే స్థాయికి ఆయన ఎదిగారు. దాదాపు తన 39 ఏళ్ళ రాజకీయ జీవితంలో రాజమండ్రిని టిడిపి కి కంచుకోటగా మార్చిన ఘనత నిస్సందేహంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి దే అని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో పటిష్టమైన పార్టీ యంత్రాంగం ఒకప్పుడు గోరంట్ల గ్రాస్ రూట్ లో ఏర్పాటు చేసిందే.అలాంటి టాప్ లీడర్ కు గత ఏడేళ్ళు గా సొంత ఇలాఖాలో మాట చెల్లుబాట కావడం లేదు. దీనికి కారణం మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబ ఆధిపత్యం, వారికి అధిష్టానం ముఖ్యంగా లోకేష్ చల్లని ఆశీస్సులే గోరంట్ల బుచ్చయ్య చౌదరి భగ్గుమనడానికి దారితీశాయి. అందుకే ఆయనలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అసంతృప్తి తలెత్తింది. రాజకీయాల నుంచే శాశ్వతంగా వైదొలగాలన్న నిర్ణయానికి వచ్చారు.ఒకటి రెండు సార్లు కాదు రాజమండ్రి కార్పొరేషన్ లో మూడు సార్లు తన వ్యూహంతో తెలుగుదేశం పార్టీకి మేయర్ స్థానం దక్కేలా చేయగలిగారు గోరంట్ల బుచ్చయ్య చౌదరి. అయితే కొంత కాలంగా పార్టీలో తనను కాదని ఆదిరెడ్డి వర్గానికి పెరిగిన ప్రాధాన్యతతో బుచ్చయ్య వర్గానికి చెందిన వారు వరుసగా వైసిపి కండువా కప్పేసుకోవడం మొదలు పెట్టారు. వీరిలో గోరంట్ల కు ప్రధాన అనుచరులుగా ఉండే మాజీ కార్పొరేటర్ లు పాలిక శ్రీనివాస్, బెజవాడ రాజ్ కుమార్ జై జగన్ అంటే మరో మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్ జై బిజెపి అని వెళ్ళి పోవడం గమనార్హం.మరికొందరు మాజీ కార్పొరేటర్ లు కూడా వైసిపి లో సీటు ఒకే అంటే వెళ్ళేందుకు సై అనేలాగే ఉన్నారు. ఇంకొందరు మాజీ కార్పొరేటర్ లు క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇవన్నీ గోరంట్ల బుచ్చయ్య చౌదరికు పార్టీలో ప్రయారిటీ తగ్గడం ఒక కారణం అయితే ఆదిరెడ్డి అప్పారావు వర్గం తో ప్రయాణం చేయలేక జరుగుతున్న పరిణామాలు గా పసుపు పార్టీలో టాక్.ఆదిరెడ్డి మౌనంరాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇచ్చిన జర్క్ ఆ పార్టీలో ఇప్పట్లో తగ్గేది అయితే కాదు. పార్టీకి రాం రాం చెప్పేస్తా అన్న చిన్నన్న నిర్ణయం పై తూర్పుగోదావరి జిల్లాలోనే కాదు ఏపీ అంతా ప్రకంపనలు కొనసాగుతున్నాయి. పార్టీలో కానీ అధికారపార్టీలో కానీ ఏమి జరిగినా స్పందించే సీనియర్ నేత యనమల రామకృష్ణుడు పూర్తిగా కొంతకాలంగా స్తబ్దుగానే ఉంటూ వస్తున్నారు. తూర్పు రాజకీయాలకు టిడిపి లో పెద్ద దిక్కుల్లో యనమల రామకృష్ణుడు ఒకరు. ఆయన కూడా నారా లోకేష్ స్పీడ్ అందుకున్నాక అన్ని విషయాల్లో అంటి ముట్టనట్లే వ్యవహారాలను నెట్టుకొస్తున్నారు.యనమల రామకృష్ణుడుతో సమానంగా జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గతంలో స్పీడ్ గా ఉండేవారు. అయితే ఆయన వైసిపి లోకి వెళ్ళి తిరిగి టిడిపి లోకి వచ్చాకా కేవలం ఆయన నియోజకవర్గం వరకే పరిమితం అయ్యారు.

ఇటీవల అనారోగ్యం కూడా ఆయన్ను జిల్లా రాజకీయాల్లో చురుగ్గా లేకుండా చేస్తుంది. ఇక గోరంట్ల వంటి సీనియర్ నేతతో సమానమైన నాయకుడు తూర్పులో మరొకరు లేకపోవడం కూడా ఈ వ్యవహారంలో తలదూర్చే సాహసం ఎవరు చేయలేకపోతున్నారు. ఒక్క నిమ్మకాయల చినరాజప్ప మాత్రమే జిల్లాలో ఏమి జరిగినా చంద్రబాబు దూతగా అక్కడ ప్రత్యక్షం అవుతూ పార్టీని గాడిన పెట్టేందుకు నేతలను బుజ్జగించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.గోరంట్ల బుచ్చయ్య చౌదరి గుస్సా కు ప్రధాన కారణమైన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం తాజా పరిణామాలపై మౌనం దాల్చింది. అధినేతే అన్ని చూసుకుంటారు అనే ధీమాలో ఆ వర్గం వేచి చూస్తుంది. అదీగాక ఇటీవల పార్టీ పదవుల పందేరంలో ఆదిరెడ్డి కుటుంబం వెంట ఉన్న వారికి పదవులు బాగానే దక్కాయి. దాంతో గోరంట్ల వేడి మీద ఉన్నప్పుడు గొంతు పెంచితే మంచిది కాదని అధిష్టానం నుంచి అందిన సమాచారంతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని ఆమె భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్ మీడియా ముందు ఈ అంశాలపై చర్చించేందుకు ఆసక్తి చూపడం లేదు.

## 1000 మందికి ఉపాధి కల్పించడమే వై ఎస్ ఎన్ ఫుడ్స్ సంస్థ లక్ష్యం

### మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఖాదర్ బాషా

నెల్లూరు ఆగస్టు 23, (న్యూస్ పల్స్) 1000 మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే వై ఎస్ ఎన్ ఫుడ్స్ లక్ష్యం అని సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఖాదర్బాషా పేర్కొన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ మరియు ఫ్లై ఓవర్ బ్రిడ్జి ల సమీపంలో వైఎస్ఆర్ ఫుడ్స్ మిషనరీ నీ నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 120 రకాల వివిధ స్నాక్స్ ఐటమ్స్ లను వై ఎస్ ఎం ఫుడ్ ఫ్యాక్టరీ నందు లభిస్తాయన్నారు. నమ్మకమైన, నాణ్యమైన ఆహార ఉత్పత్తులు తయారుచేయడంలో ఏ విధంగానూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. వివిధ రకాల బిస్కెట్స్, బన్స్, బెడ్స్ తదితర అన్ని రకాల స్నాక్స్ ఐటమ్స్ తయారు చేయడంలో అనుభవజ్ఞులైన వంట పని వారు వై ఎస్ ఎం ఫుడ్స్ నందు పని చేస్తున్నారని తెలిపారు. నెల్లూరులో నూతనంగా ప్రారంభించబడిన వై ఎస్ ఎన్ ఫుడ్ ఫ్యాక్టరీ నందు ప్రస్తుతం 150 మంది పైచిలుకు సిబ్బంది పని చేస్తున్నారని తెలియజేశారు. రానున్న రోజులలో 1000 మందికి ఉపాధి కల్పించడంతో పాటు, 6 రాష్ట్రాలలో వై ఎస్ ఎన్ ఫుడ్స్ ఉత్పత్తులు ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు జరుపుతున్నామన్నారు. తొలుత ఉస్మానియా బిస్కెట్లతో ప్రారంభించబడిన తమ వ్యాపార సంస్థ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రస్థాయిలో తమ ఉత్పత్తులను పంపిణీ చేసేందుకు సహకారం అందించిన సిబ్బందికి, ఆహార ప్రియులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు ఎల్ పి కృష్ణారెడ్డి, సిహెచ్ వినోద్ కుమార్, మేనేజర్ అబ్దుల్ , కార్యాలయ ఇంచార్జి సుధారాణి మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్ డెంటల్ క్లినిక్ ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్

విశాఖ పట్నం సీతమ్మధార జీవీఎంసి 14 వ వార్డు పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్లో డాక్టర్ సుధాకర్ పట్నాయక్ ఆధ్వర్యంలో 4డిఎస్ డెంటల్ క్లినిక్ ను ముఖ్య అతిథిగా పాల్గొని ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా విశాఖపట్నం కాకినాడ పెట్రొలియం కెమికల్ ఉ పెట్రోకెమికల్ ఇన్వెస్టుమెంట్ రీజియన్ చైర్ పర్సన్ చొక్కాకుల లక్ష్మి వెంకటరావు, రాష్ట్ర శిష్టికరణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్పర్సన్ అనూష పట్నాయక్, యువనాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డి సడెన్ విజిట్ సంగతేంటీ

విజయవాడ, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)ఏపీలో ఒక అనూహ్య సన్నివేశం చోటు చేసుకుంది. బీజేపీకి చెందిన అగ్ర నేత. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంటిని వెళ్ళి ఆతిధ్యాన్ని స్వీకరించడం. నిజంగా ఇది ఏపీ రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఎందుకంటే ఆయన పార్టీ కార్యక్రమం మీదనే ఏపీలో పర్యటించారు. జన ఆశీర్వాద యాత్ర పేరిట ఆయన ఏపీలో సభ పెట్టి వైసీపీని తెగనాడారు, అదే సమయంలో బీజేపీ ప్రభుత్వాన్ని పొగిడారు. ఇలా ఏపీలో పొలిటికల్ హీట్ పెంచిన ఆయన సడెన్ గా జగన్ ఇంట్లో ప్రత్యక్షం అయ్యారు. జగన్ సైతం ఆయన్ని సాదరంగా ఆహ్వానించి ముచ్చట్లు పెట్టారు.ఏపీలో చోటు చేసుకున్న ఈ పరిణామంతో తెలుగుదేశం ఉలిక్కిపడింది. ఎందుకంటే అటు జగన్ కి బీజేపీ మధ్య బాగా చెడింది అని ఆ పార్టీ భావిస్తోంది. ఈ మాత్రం సందు దొరికితే చాలు దూరిపోవచ్చు అని కూడా ఎత్తులు వేస్తోంది. ఏది ఏమైనా జగన్ బలం పెరగకుండా చూడాలి అంటే ఢిల్లీ బంధం తెంచేయాలి అన్నదే టీడీపీ వ్యూహకర్తల ప్లాన్. ఆగస్ట్ నెల మొదలవుతూనే అలాంటి హీట్ కనిపించింది, వైసీపీ మంత్రి పేర్ని నాని అయితే బీజేపీ తమ సర్కార్ ని కూలదోస్తోంది అంటూ ఘాటు విమర్శలు చేశారు. అలా అటూ ఇటూ కూడా విమర్శల పర్వం సాగిన తరువాత ఇక తెగేదాకా లాగేశారు పుటుక్కుమనడమే అని టీడీపీ అనుకుంటోంది. కానీ ఇపుడు సీన్ రివర్స్ అయింది మరి.వెంకయ్యనాయుడు శిష్యుడిగా బీజేపీ రాజకీయాల్లో ఎదిగిన కిషన్ రెడ్డి మోడీకి ఇష్టుడు అని చెబుతారు. అందుకే ఆయనను ఏకంగా కేంద్ర క్యాబినెట్ మంత్రిగా నియమించారు. ఏపీకి ప్రత్యేకించి కేంద్ర మంత్రి లేరు. దాంతో కిషన్ రెడ్డి ఇక్కడ పార్టీ వ్యవహారాలను ఒక కంట కనిపెట్టాల్సిందే. అదే సమయంలో ఢిల్లీ పెద్దలకు ఆయన ద్వారానే పూర్తి సమాచారం కూడా అందుతుంది. తెలుగు మంత్రి అయిన ఆయన సూచనలు కూడా బీజేపీ పట్టించుకుంటుంది అన్నది వాస్తవం. ఇపుడు అలాంటి కిషన్ రెడ్డి జగన్ తో కరచాలనం చేయడం అంటే మండిపోతోంది ప్రత్యర్ధి పార్టీ.కయ్యంగా మారాలి. అది కళ్లారా చూడాలి అని ఆశించిన టీడీపీకి ఇపుడు ఆశాభంగమే అయిందనుకోవాలి. కిషన్ రెడ్డి, జగన్ భేటీ అయిన తరువాత టీడీపీ అనుకూల మీడియా రాసిన రాతలు చూస్తే సైకిల్ పార్టీ అసహనం అందులో కనిపిస్తోంది. నిజానికి బీజేపీ జగన్ని ఏమీ చేయదు అని విశ్లేషకులు కూడా చెబుతారు. జగన్ నమ్మకమైన మిత్రుడిగానే వారు చూస్తారు. ఆయన కోరిన తీరున సాయం చేయకపోయినా ఆయన మీద భారీ యాక్షన్ ప్లాన్ చేసి టీడీపీకి మాత్రం అవకాశం ఇవ్వరనే అంటారు. ఇక ఏపీలో జగన్ బలం కూడా ఢిల్లీ పెద్దలకు తెలుసు. ఇపుడు ఏపీ రాజకీయ పార్టీలకు అర్ధమైన మరో విషయం ఏంటి అంటే జగన్ కి కూడా బీజేపీలో మంచి మిత్రులు ఉన్నారని. అది తట్టుకోవడం బహుశా టీడీపీకి కష్టమే కావచ్చు.

## జగన్ క్రేజ్ తగ్గిందా....

విజయవాడ, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)జగన్ సర్కారుపై అవకాశం చిక్కినప్పుడల్లా.. విరుచుకుపడే టీడీపీ అధినేత చంద్రబాబు.. తాజాగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేక పోయారనే వాదన వినిపిస్తోంది. తాజాగా ఏపీ సీఎం జగన్ విషయంలో ఒక చిత్రమైన ఘటన జరిగింది. ఆయనకు ఉన్న ప్రజాభిమానం తగ్గిపోయిందని.. గత ఏడాది ఉత్తమ ముఖ్య మంత్రిగా దేశంలో 4వ స్థానంలో ఉన్న జగన్.. పరిస్థితి ఇప్పుడు ఏకంగా 16వ స్థానానికి పడిపోయిందని ఓ ప్రముఖ జాతీయ మీడియా సర్వే స్పష్టం చేసింది. ఇది నిజానికి జగన్‌కు తీవ్ర ఇబ్బందికర పరిణామమే. దీనిని తట్టుకుని.. వచ్చే ఏడాది నాటికి జగన్ పుంజుకోవాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో ఆయన ఎందుకు ? ఇంతగా తన ప్రభావం కోల్పోయారనే విషయంపైనా దృష్టి పెట్టాలి. జగన్ క్రేజ్ ఎందుకు తగ్గిందనే దానిపై ఇప్పటికే రకరకాల విశ్లేషణలు కూడా మొదలైపోయాయి.నిజానికి జగన్ ప్రవేశ పెట్టిన పథకాలు.. అమలు చేస్తున్న సంక్షేమం వంటివి ఇతర రాష్ట్రాల్లోనూ లేవని అధికార పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు.. రాష్ట్రంలో ఎక్కడా లేని.. విధంగా ప్రజలకు వేలకు వేల రూపాయలను లబ్ధి దారుల అకౌంట్లలో వేస్తున్నారు. మరి ఇంత చేస్తున్నా.. జగన్ గ్రాఫ్ గత ఏడాదికి ఇప్పటికి ఎందుకు ? దిగజారిందనేది ప్రశ్న. ఇదిలావుంటే.. జగన్‌పై నిత్యం విమర్శలు చేసే చంద్రబాబుకు ప్రస్తుతం వచ్చిన ఈ అవకాశం ఎందుకు కనిపించలేదనేది ప్రశ్న. ఎందుకంటే.. చంద్రబాబు కోరుకున్నది ఇదే. జగన్ గ్రాఫ్ పడిపోవాలి.. తన అవసరం ప్రజలకు తెలియాలి. ఇదే చంద్రబాబు కోరుకున్నారు.ఇప్పుడు సీఎంగా జగన్ గ్రాఫ్ పడిపోవడం.. ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందనే అంచనాల నేపథ్యంలో చంద్రబాబు దీనిని అందిపుచ్చుకుని జగన్‌పై విమర్శల పర్వం పెంచుతారని అందరూ అనుకున్నారు. అయితే.. అనూహ్యంగా చంద్రబాబు మాత్రం.. ఈ విషయాన్ని పట్టించుకోలేదు.అసలు దీనిపై కామెంట్లుకూడా పెద్దగా చేయలేదు. అయితే కొన్ని మీడియా సంస్థలు మాత్రం జనం మెచ్చడం లేదంటూ.. జగన్‌పై విమర్శలతో కథనాలు వండి వార్చేశారు. పోనీ .. వీటిని కూడా టీడీపీ పట్టించుకున్నట్లు లేదు. ఈ క్రమంలో ఒక విషయాన్ని విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు.ఇప్పుడు జగన్‌ను విమర్శిస్తే.. ఇదేసమయంలో తెలంగాణ ముఖ్యమంత్రి విషయం కూడా ప్రస్తావనకు తీసుకురావాల్సి ఉంటుందని.. తొలి పది మంది ముఖ్యమంత్రుల్లో కేసీఆర్ కూడా లేరని.. సో.. జగన్‌ను విమర్శించి కేసీఆర్‌ను పక్కన పెడితే.. టీడీపీని కార్నర్ చేస్తూ.. వైసీపీ కూడా విమర్శలు చేసే అవకాశం ఉంటుందని చంద్రబాబు భావించి ఉంటారని అంటున్నారు. ఈ పరిణామాలతోనే చంద్రబాబు ఫుల్‌గా సైలెంట్ అయ్యారని అంటున్నారు. ఏదేమైనా.. ఒక మంచి ఛాన్స్ మాత్రం చంద్రబాబు మిస్ చేసుకున్నారని మాత్రం చెబుతున్నారు.

## పెట్రోల్ దాడి బాధితురాలిని పరామర్శించిన మహిళా కమిషన్ చైర్ పర్సన్

విశాఖపట్నంఆగస్టు 23, (న్యూస్ పల్స్)పెట్రోల్ దాడి బాధితురాలిని కేజీహెచ్ లో మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ సోమవారం పరామర్శించారు. విజయనగరం జిల్లా చౌడువాడలో పెట్రోల్ దాడిలో బాధితురాలు గాయపడిన విషయం తెలిసిందే. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ మహిళలు రాష్ట్రంలో అర్ధబాగం. 26 నెలల జగన్ పరిపాలనలో మహిళా సంక్షేమాని పెద్దపీట వేశారు. బాలికలు దగ్గర నుండి పండు ముసలి వరకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది. పురష ఆధిపత్యం ఉండే రాజకీయం రంగంలో కూడా మహిళలు కూడా సమానం అని ముఖ్యమంత్రి నిరూపిస్తున్నారు. మహిళా సాధికారత కోసం మహిళా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తుంది. మహిళా ఉద్యోగుల వేధింపులపై మహిళా కమిషన్ దృష్టి సారించింది. అంతర్గత ఫిర్యాదుల కమిటీలు వేస్తున్నాము. ప్రతిపక్షాలు విమర్శలు ఆపాలి. గత ప్రభుత్వంలో మహిళలకు అన్యాయం జరిగినా స్పందించని చంద్రబాబు, ఇప్పుడు విమర్శలు చేయడం సమంజసం కాదు. టెక్నాలజి, సామాజిక మాధ్యమాలు వలన ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు.

# గోరంట్ల అస్త్రంతో బాబు ఉక్కిరిబిక్కిరి

రాజమండ్రి, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)తెలుగుదేశం లో ఎవరికి లభించని అవకాశాలు రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరికి దక్కాయనే చెప్పాలి. పార్టీ ప్రారంభం నుంచి ఆయన ఏ ఎన్నికల్లో టిడిపి టికెట్ ను మిస్ అవ్వలేదు. ఎన్నిసార్లు ఆయన్ను చంద్రబాబు పక్కకు పెట్టాలనుకున్నప్పటికీ అనివార్యంగా టికెట్ ఇవ్వక తప్పని పరిస్థితిని గోరంట్ల బుచ్చయ్య చౌదరి కల్పించారు. దాని ఫలితంగానే మొన్నటి ఎన్నికలతో కలిపి తొమ్మిది సార్లు అసెంబ్లీ టికెట్ గోరంట్లకు దక్కడం ఒక రికార్డ్ గానే చెప్పొచ్చు. అలాంటి గోరంట్ల కు పార్టీనుంచి పోతే కానీ మనశ్శాంతి లభించదన్నంత వేదన ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం తన స్కూల్ నుంచి వచ్చిన ఆదిరెడ్డి కావడం గమనార్హం. అప్పారావు టిడిపి లోకి రీ ఎంట్రీ ఇస్తున్నారనగానే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదిరెడ్డికి చెక్ పెట్టేందుకు ఆయన తోడల్లుడు చల్లా శంకర రావు ను టిడిపి తీర్థం పుచ్చుకునేలా చేశారు.రాజమండ్రి ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ చైర్మన్ గా శంకర రావు నాడు పనిచేసేవారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆదిరెడ్డి తోడల్లుడు శంకర రావు పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయిన రికార్డ్ ఉంది. గోరంట్ల బుచ్చయ్య చౌదరి తో నాడు సమాన ఓట్లను శంకర రావు తెచ్చుకోగలిగారు. గోరంట్ల శంకర రావు లు ఓడిపోయి స్వల్ప ఆధిక్యతతో వీరిద్దరిపై 2009 లో రౌతు సూర్యప్రకాశరావు కాంగ్రెస్ ను గెలిచారు. ఇవన్నీ చంద్రబాబు కు వివరించి మచ్చలేని చల్లా కుటుంబానికి అవకాశం ఇవ్వాలని పార్టీకి ద్రోహం చేసిన వారిని ప్రోత్సహించవద్దని గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పారని అంటారు . అప్పారావు కు టికెట్ ఇస్తే ఆయన పార్టీలో ఉంటారో పోతారో తెలియదని గత అనుభవాలను బాబు ముందు గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఉంచారని పార్టీ వర్గాల్లో ప్రచారం. తన తోడల్లుడినే అడ్డుపెట్టి బుచ్చయ్య వేస్తున్న ఎత్తుగడలను చిత్తు చేస్తూ చంద్రబాబు, నారా లోకేష్ లతో గట్టి లాబీయింగ్ చేయడం లో సక్సెస్ అయ్యారు ఆదిరెడ్డి అప్పారావు.ఎర్రన్నాయుడు కుటుంబం పార్టీ ఆరంభం నుంచి చంద్రబాబు తో ఉండటం ఆదిరెడ్డి కుటుంబానికి అవకాశాలు కల్పించడానికే అధిష్టానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 2019 ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ టికెట్ ను తన కోడలు ఆదిరెడ్డి భవాని కి ఇప్పించి ఆమె గెలవడం లో అప్పారావు గట్టి ప్రణాళికతో పని చేశారు. ఆమె కూడా 30 వేలకు పైగా మెజారిటీ తో వైసిపి హవాను ఎదుర్కొని రెండుసార్లు ఎమ్మెల్యే గా పనిచేసిన అనుభవజ్ఞుడు రౌతు సూర్య ప్రకాశరావు పై గెలిచారు. ఆమె గెలుపు తరువాత గోరంట్ల బుచ్చయ్య చౌదరి ని రాజమండ్రి నియోజకవర్గంలో చెయ్యి కాలు పెట్టకుండా చేయడంలో ఆదిరెడ్డి చాక చక్యంగా వ్యవహరిస్తున్నారు. ఒకటి రెండు సందర్భాల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరి ? ఆదిరెడ్డి ఆధిపత్యం కోసం రోడ్డెక్కిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అధిష్టానం ఎవరి నియోజకవర్గాలకు వారిని పరిమితం చేసేలా రాజీ చేయడంతో కొంత కాలంగా వివాదాలు సద్దుమణిగేలాగే కనిపించినా నివురు గప్పిన నిప్పులాగే పరిస్థితి కొనసాగింది.పార్టీలో తన ప్రభ మసకబారుతు ఉండటంతో ఇక గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఇప్పుడు బ్రహ్మాస్త్రం ప్రయోగానికి సిద్ధం అయ్యారు. తన వర్గం వారిని అర్బన్ లో ఆదిరెడ్డి కుటుంబం పక్కన పెడుతూ ఉండటం పార్టీ పదవుల్లో సైతం వారికి అన్యాయం జరగడం వంటి పరిణామాలు గోరంట్లకు తాడో పేడో తేల్చుకోవాలనే నిర్ణయం వైపు నడిపించాయి. ఆయనలో అణచుకున్న అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలైంది. చివరికి పార్టీకి పదవికి గుడ్ బై కొట్టేయాలనంత నిర్వేదం ఆవరించింది. ఈ పరిణామం చంద్రబాబు కు సంకటం గా మారింది. గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్లకు తలొగ్గితే ఆదిరెడ్డి కుటుంబం కినుక వహిస్తుంది. ఆదిరెడ్డి చెప్పినదానికే సై అంటే గోరంట్ల తనదారి తాను చూసుకోక తప్పదు.

## క్రాస్ రోడ్స్ లో గాజువాక

విశాఖపట్టణం, ఆగస్టు 23, (న్యూస్ పల్స్)గాజువాక ఇపుడు విశాఖ కంటే కూడా ఎక్కువగా వినిపిస్తున్న పేరు. పారిశ్రామికవాడగా ఈ ప్రాంతానికి ఎపుడూ ప్రాధాన్యత ఉంది. ఇదిలా ఉంటే గాజువాక 2009లో ఏర్పాడిన తరువాత అక్కడ రాజకీయం ఎపుడూ ఆసక్తిని కలిగిస్తూనే ఉంది. 2009లో ప్రధాన పార్టీలను కాదని అక్కడ జనం కొత్తగా వచ్చిన ప్రజారాజ్యానికి ఓటేసి గెలిపించారు. ఇక 2014 నాటికి టీడీపీ గెలిస్తే 2019 ఎన్నికల్లో వైసీపీ గెలిచింది. ఇలా ప్రతీ ఎన్నికలోనూ విలక్షణతను చూపిస్తూ పార్టీల రాజకీయాన్ని తారుమారు చేస్తున్న ఘనత గాజువాక ఓటర్లదే.విశాఖ ఉక్కు కర్మాగారం గాజువాకలోనే ఉంది. విశాఖకే కాదు, ఏపీకి తలమానికం లాంటి ఈ ప్లాంట్ ప్రైవేట్ చేసేందుకు కేంద్రం దూకుడు చేస్తోంది. దాంతో వేలాదిగా ఉన్న కార్మిక లోకం అగ్గి రాజేస్తోంది. గాజువాకలో ఉక్కు కార్మికులే మెజారిటీగా ఉంటారు. వారి దయ ఉంటేనే ఎవరైనా రాజు అయ్యేది. దాంతో ఈసారి ఉక్కు సమస్య గాజువాకలో నేతల రాజకీయాలను తిరగరాస్తాయని అంటున్నారు. అదే విధంగా ప్రధాన పార్టీలకు కూడా చుక్కలు చూపించడం ఖాయమనే మాట వినిపిస్తోంది.గతసారి గాజువాక నుంచి తిప్పల నాగిరెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యే అయ్యారు. కానీ ఈసారి ఆయనకు గెలుపు అంత సులువు కాదు అంటున్నారు. అదే నేపథ్యంలో ఆయన వారసులకు కూడా జగన్ టికెట్లు ఇవ్వరని చెబుతున్నారు. గాజుకలో స్టీల్ ప్లాంట్ లీడర్ గా ఉంటూ మొత్తం అటునుంచి కథ నరుక్కువస్తున్న మంత్రి రాజశేఖర్ కి ఈసారి వైసీపీ టికెట్ ఇచ్చి ఉక్కు సెగ నుంచి తప్పించుకుంటుంది అంటున్నారు. అదే విధంగా టీడీపీ తరపున కూడా ఉక్కు పోరాటం చేసిన వారికే ఎంపిక చేస్తారుట. పొత్తు టీడీపీతో ఉంటే జనసేన నుంచి ఉక్కు నేపథ్యం ఉన్న కోన తాతారావు బరిలో ఉంటారని అంటున్నారు.గాజువాకతో పాటు అటు పెందుర్తి, విశాఖ పశ్చిమ ఉత్తర నియోజకవర్గాల మీద విశాఖ ఉక్కు పోరాటం ప్రభావం పడుతుంది అన్న అంచనాలు ఉన్నాయి. దాంతో దానికి ధీటుగా అధికార ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను రెడీ చేసుకుంటున్నారు అంటున్నారు. విశాఖ ఉక్కు ప్రీవేటీకరణ జరిగితే ఒకలా జరగకపోతే మరోలా ఇక్కడ సీన్ ఉంటుంది. మొత్తానికి ఈసారి కూడా అందరినీ గాజువాక అట్రాక్ట్ చేస్తుంది అంటున్నారు. గతసారి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ గాజువాక నుంచి పోటీ చేసిన సంగతి విదితమే. మొత్తానికి విశాఖ ఉక్కు కాదు కానీ అన్ని రాజకీయ పార్టీల రాజకీయ సరదా ఈసారి తీర్చేసేలా కథ సాగుతుంది అంటున్నారు

## ఉప్పుటేరు లో కాలుజారి ఇద్దరు చిన్నారులు మృతి

__సిరి మామిడి విషాదఛాయలు__

శ్రీకాకుళం ఆగస్టు 23, (న్యూస్ పల్స్)శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం సిరి మామిడి గ్రామంలో సిరి మామిడి ఉప్పుటేరు వద్ద సాయంత్రం ఐదు గంటల సమయంలో శ్రీశాంత్ ,హర్షిత్ ఇసుక దిబ్బల పై ఆడుకుంటూ కాలుజారి ఉప్పుటేరులో పడి మరణించారు పోలీసుల కథనం ప్రకారం దున్న శ్రీ శాంత్ వయసు 8 సంవత్సరాలు తండ్రి పేరు దున్న కాంతారావు తల్లి నీలవేణి మరియు కారాగి .హర్షిత్ వయస్సు ఏడు సంవత్సరాలు కారాగి ప్రకాష్ తల్లి పేరు కల్పన ఇద్దరు పిల్లలను హరిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు చికిత్స పొందుతూ మరణించినట్లుగా వైద్యులు తెలియజేశారు ఘటనా స్థలానికి సోంపేట సీఐ సతీష్ కుమార్ బారువ ఎస్సై రమేష్ పరిశీలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ షాక్ తో రైతు మృతి

చిత్తూరు ఆగస్టు 23, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లా వి.కోట మండలం చిన్నశ్యామలో పోలం వద్ద విద్యుత్ షాక్ తో ఒకరు మృతి చెందగా మరోకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో తండ్రి శంకరప్ప (41) మృతి చెందాడు. అతని కుమారుడు వంశీ (13) పరిస్థితి విషయంగా వుంది. బాలుడుని వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనతో చిన్నశ్యామలో విషాదం నెలకొంది. సోమవారం ఉదయం పొలం దున్నేందుకు ట్రాక్టర్ రావడంతో తండ్రి .. కొడుకులు పొలం వద్దకు వెళ్ళారు. అక్కడ ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్కు చెందిన వైర్లను పక్కన వేసేందుకు ప్రయత్నించగా బాలుడు విద్యుత్ షాక్కు గురైయ్యాడు. గమనించిన శంకరప్ప ఇనుప పైప్ తో బాలుడిని రక్షించేందుకు చేసిన ప్రయత్నంలో బాలుడు ప్రాణాలతో బయట పడగా.. తండ్రి శంకరప్ప మృతి చెందాడు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిను వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు బాలుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారు. మృతి చెందిన శంకరప్పను ఇంటి వద్దకు తరలించారు. ఈ ఘటనతో తాము ఇంట్టి పెద్ద దిక్కును కొల్పోయామని మృతుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఐ ప్రసాద్ బాబు ఘటనా స్థాలనికి చేరుకుని ప్రమాదం జరిగిన వైనం పై పరిశీలిస్తున్నారు.

## పేలిపోయిన గ్యాస్ ట్యాంకర్

విజయనగరం ఆగస్టు 23, (న్యూస్ పల్స్)విజయనగరం జిల్లా కేంద్రలోని అశోక్ నగర్ వద్ద గ్యాస్ ట్యాంకర్ విధ్వంసం సృష్టించింది. గ్యాస్ ట్యాంకర్ కి వెల్డింగ్ చేస్తుండగా ఒక్క సారిగా పేలిపోయింది. ఘటనతో ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. కెమికల్ లోడ్ ట్రాన్స్ఫోర్ట్ కి ఉపయోగించే గ్యాస్ ట్యాంకర్ కావడంతో ప్రమాదం సంభవించినట్టు స్థానికులు తెలిపారు.

## అగ్రిగోల్డ్ బాధితుల మృతికి చంద్రబాబే కారణం

విశాఖపట్నం ఆగస్టు 23, (న్యూస్ పల్స్)అగ్రి గోల్డ్ బాదితుల 300మంది మరణానికి అప్పటి ముఖ్యమంత్రి, టీడీపీ నాయకుడు చంద్రబాబు నాయుడే ప్రధాన కారణం అని రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కెకె రాజు ఘాటు విమర్శలు చేశారు. విశాఖ ఉత్తర నియోజక వర్గం వైసిపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రి గోల్డ్ బాదితుల కు తీవ్ర అన్యాయం చేసింది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబే అంటూ దుయ్యబట్టారు. సుజనా చౌదరి, లోకేష్, మురళీ మోహన్ కోటరీగా ఏర్పడి అమరావతిలో అగ్రి గోల్డ్ ఆస్తులు దోచేయడానికే ప్లాన్ చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాదితుల కు దశల వారీగా న్యాయం చేస్తున్నామన్నారు. ఇప్పటి కే పది వేల లోపు డిపాజిట్ చేసిన 3 లక్షల 40 వేల మందికి 240 కోట్లు రూపాయలు నగదు జమ చేయడం జరిగింది అని, ఈ విడతలో ఇరవై వేలు లోపు డిపాజిట్ చేసిన వారికి నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. అగ్రి గోల్డ్ బాదితుల కు బడ్జెట్ లో 1150కోట్లు కేటాయించడం జరిగింది అన్నారు. అగ్రి గోల్డ్ సంస్థ భూములు లో టిడ్కో గృహాలు నిర్మాణం చేసి అర్హులైన బాదితుల కు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీను, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్ రావు, కార్పొరేటర్ అనీల్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో నదుల అనుసంధానానికి 'నిరా'



__జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ ప్రతిపాదన__

__ఏకాభిప్రాయానికి కసరత్తు__

అమరావతి ఆగష్టు 23 దేశంలో నదుల అనుసంధానం పనులు చేపట్టడానికి నేషనల్ ఇంటర్ లింకింగ్ ఆఫ్ రివర్స్ అథారిటీ(ఎన్ఐఆర్ఏ ? నిరా) పేరుతో ప్రత్యేకంగా సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖకు జాతీయ జల వనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ప్రతిపాదించింది. కడలిపాలవుతోన్న నదీ జలాలను మళ్లించి.. దేశాన్ని సుభిక్షం చేసేందుకు నదుల అనుసంధానం చేపట్టాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.దీంతో నదుల అనుసంధానంపై అధ్యయనం చేసిన ఎన్‌డబ్ల్యూడీఏ హిమాలయ నదులను అనుసంధానం చేసేందుకు 14, ద్వీపకల్ప నదులను అనుసంధానం చేయడానికి 16 ప్రతిపాదనలు చేసింది. ఈ మేరకు నదుల అనుసంధానం చేపట్టాలని 2012 ఫిబ్రవరి 27న సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో నదుల అనుసంధానం కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేస్తూ 2014 సెప్టెంబరు 23న కేంద్ర జల్ శక్తి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నదుల అనుసంధానంపై అధ్యయనం, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయడానికి, రాష్ట్రాలతో సంప్రదింపులు జరపడానికి ఎక్కువ సమయం పడుతుందని ఎన్‌డబ్ల్యూడీఏ కేంద్రానికి తెలిపింది. ఈ సమస్యను అధిగమించడానికి 'నిరా' పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచించింది. జాతీయ ప్రాజెక్టుల తరహాలోనే నదుల అనుసంధానం పనులు చేపట్టడానికి 90 శాతం నిధులను కేంద్రం సమకూర్చాలని పేర్కొంది.మిగతా 10 శాతం నిధులను ప్రయోజనం పొందే రాష్ట్రాలు ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో భరించాలని సూచించింది. కేంద్రం, రాష్ట్రాలు నిధులను 'నిరా'కు అందజేస్తే.. పనులు చేపడుతుందని పేర్కొంది. కెన్?బెట్వా నదుల అనుసంధానం నుంచే 'నిరా'కు బాధ్యతలు అప్పగించాలని సూచించింది. ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ఈ ప్రతిపాదనలపై కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేస్తే నదుల అనుసంధానం పనులకు మార్గం సుగమమవుతుంది.ఏకాభిప్రాయంతో నదుల అనుసంధానాన్ని చేపట్టడానికి ప్రత్యేక కమిటీ ప్రయత్నాలు చేస్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతూ ఏకాభిప్రాయం సాధించడానికి చర్యలు చేపట్టింది. కెన్?బెట్వా నదుల అనుసంధానానికి ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు అంగీకరించాయి. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమక్షంలో కెన్?బెట్వా నదుల అనుసంధానం ఒప్పందంపై ఆ రాష్ట్రాల సీఎంలు యోగి ఆదిత్యనాథ్, శివరాజ్‌సింగ్ చౌహాన్‌లు గతేడాది మార్చి 22న సంతకం చేశారు. 2017?18 ధరల ప్రకారం ఈ ప్రాజెక్టుకు రూ. 35,111.24 కోట్ల వ్యయం అవుతుంది. ఈ నేపథ్యంలో గోదావరి?కృష్ణా?పెన్నా?కావేరీ నదుల అనుసంధానం కోసం ఈ నాలుగు నదుల పరీవాహక ప్రాంతంలోని రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ పనులకు 2018?19 ధరల ప్రకారం రూ. 60,361 కోట్లు అవసరం అవుతుందని అంచనా. ఇదే రీతిలో మిగిలిన నదుల అనుసంధానానికి ప్రత్యేక కమిటీ రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతోంది.

## సృష్టిలోని సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలి

__వసంత మండపంలో ముగిసిన సకల కార్యసిద్ధి శ్రీమద్ రామాయణ పారాయణం__

__సెప్టెంబర్ 2వ తేదీ నుండి షోడశదిన బాలకాండ పారాయణ దీక్ష__

__టిటిడి అదనపు ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి__



తిరుమల, ఆగస్టు 23, సృష్టిలోని సకల జీవరాశులు ఆయురారోగ్యాలతో ఉండాలని, కరోనా నుండి ప్రపంచం విముక్తి కలగాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలో 30 రోజుల పాటు నిర్వహించిన సకల కార్యసిద్ధి శ్రీమద్ రామాయణ పారాయణం సోమవారం మహా పూర్ణాహుతితో ముగిసిందని టిటిడి అదనపు ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. మహాపూర్ణాహుతి కార్యక్రమంలో అదనపు ఈవో దంపతులు పాల్గొన్నారు. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ శ్రీ కుప్పా శివసుబ్రమణ్య అవధాని ఆధ్వర్యంలో వసంత మండపంలో సకల కార్యసిద్ధి శ్రీమద్ రామాయణ పారాయణంలోని శ్లోకాల పారాయణం, ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో జప-తర్పణ-హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ లోక సంక్షేమం కోసం, కరోనా రెండవ వేవ్ అరికట్టాలని శ్రీవారిని ప్రార్థిస్తూ రెండు సార్లు 16 రోజుల పాటు షోడశదిన సుందరకాండ దీక్ష, ఒకే రోజు 17 గంటల పాటు నిర్విరామంగా సుందరకాండ పారాయణం నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా 30 రోజుల పాటు యుద్ధకాండ పారాయణం, సకలకార్యసిద్ధికి శ్రీమద్ రామాయణ పారాయణం నిర్వహించినట్లు వివరించారు. కరోనా మూడవ వేవ్ చిన్న పిల్లలను ఇబ్బంది పెడుతుందని ప్రభుత్వాలు, వైద్య సంస్థలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో బాలల క్షేమం కోసం సెప్టెంబర్ 2వ తేదీ నుండి బాలకాండలోని శ్లోకాల పారాయణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో శ్రీ రామచంద్రమూర్తి బాల్య విశేషాలు, రాక్షస సంహారం, శివధనస్సు విరిచి సీతాదేవిని కల్యాణం చేసుకోవడం తదితర అంశాలు ఉన్నాయన్నారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా భక్తులు ఈ పరాయణంలోని శ్లోకాలను వీక్షించిన, పఠించిన, శ్రవణం చేసిన సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలో : ధర్మగిరి వేద విజ్ఞానపీఠంలోని ప్రార్థనా మందిరంలో ప్రతి రోజు సకల కార్యసిద్ధి శ్రీమద్ రామాయణ పారాయణంలో భాగంగా కరోనా వ్యాధి వ్యాప్తి నివారణకు విశేష మంత్రాలతో జప-తర్పణ-హోమాదులు నిర్వహించారు. లోక క్షేమం కోసం 30 రోజుల పాటు ఉపాసకులు అకుంఠిత దీక్ష, శ్రద్ధలతో శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీ రామ మూల మంత్రానుష్టానం 27 లక్షల సార్లు జపించారు. జపంలో పదవ వంతు ఆవు పాలతో తర్పణం, తర్పణంలో 10వ వంతు హోమాలు నిర్వహించారు. మహా పూర్ణాహూతి సందర్బంగా సోమవారం ఉదయం మూల మంత్ర హోమాలు, శ్లోక హోమాలు, మండప దేవత హోమాలు, అంగ హోమాలు, పౌష్టిక హోమాలు, శాంతి హోమాలు, జయాతి హోమం, కుంభారాధన జరిగింది. తరువాత సమస్త దోషాలు తొలగి పోవాలని అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12 గంటలకు సంకల్పం, హోమద్రవ్య పూజ, బలి ప్రదానం, ద్రవ్య సమర్పణ, వసోర్ధారా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది.వసంత మండపంలో : అంతకుముందు తిరుమల వసంత మండపంలో ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ శ్రీ కుప్పా శివసుబ్రమణ్య అవధాని మాట్లాడుతూ రామాయణంలోని బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండలోని ప్రధానమైన సర్గలను పారాయణం చేసినట్లు తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో ధర్మకార్యం సిద్ధించాలని కోరుతూ ఆయా కాండల్లోని ప్రధానమైన సర్గలలోని శ్లోకాలను పారాయణం చేసినట్లు వివరించారు. శ్రీమద్ రామాయణ పారాయణంలో 20 కామ్యములకు సంబంధించిన శ్లోకాలను 16 మంది ఉపాసకులు అత్యంత దీక్షా శ్రద్ధలతో పారాయణం చేశారన్నారు.ప్రత్యేక ఆకర్షణగా ఊంజల సేవ మండపం సీతా, లక్ష్మణ సమేత శ్రీ రామచంద్రమూర్తి ఉత్సవమూర్తులు కొలువైన ఊంజల్ సేవ మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారికి ఎదురుగా శ్రీ బాల ఆంజనేయ స్వామి, శ్రీ అంజనా దేవి ప్రతి రూపాలు కూడా ఉంచబడ్డాయి. టిటిడి ఎస్వీ సంగీత నృత కళాశాల అధ్యాపకులు శ్రీమతి వందన బృందం, " భావయామి రఘు రామమ్...... " , అనే శ్రీ స్వాతి తిరునాల్ రచించిన సంకీర్తనను సుమధురంగా అలపించారు. బాలకాండ నుండి యుద్ధకాండ వరకు ఉన్న అన్ని ఘట్టాలను ఈ సంకీర్తనలో పొందుపరిచారు. ఎస్వీబీసి సిఇవో శ్రీ సురేష్ కుమార్, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, పండితులు పాల్గొన్నారు.

## మహిళలకు తోడుగా జగన్ సర్కార్

విశాఖపట్నం మహిళలకు జగన్ సర్కార్ తోడుగా ఉంటుందని, ప్రతిపక్షాలు విమర్శలు ఆపాలని మహిళా కమిషన్ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. విశాఖలో సదస్సులో పాల్గొన్నారు.26 నెలల జగన్ పరిపాలనలో మహిళా సంక్షేమాని పెద్దపీట వేశారని చెప్పారు. రాజకీయ పదవుల్లో సమాన భాగస్వామ్యం కల్పించామని, మహిళ అందరికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసాను అందించారు.30 లక్ష లు మంది దిశ యాప్ ను డౌన్ లోడ్ చేసుకున్నారని,మహిళ ఉద్యోగుల వేధింపులపై ప్రత్యేక ఫోకస్ పెట్టామని తెలిపారు.మహిళా సాధికారత కోసం మహిళా కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు,చర్చా గోష్ఠులు నిర్వహిస్తు న్నామని,టెక్నాలజి, సామాజిక మాధ్య మాలు వలన ఇబ్బందికరమైన పరిస్థి తులు ఏర్పడుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు అన్యా యం జరిగినా స్పందించని చంద్రబాబు, ఇప్పుడు విమర్శలు చేయడం సమంజసం కాదని అన్నారు.

## ఇంద్రకీలాద్రిలో ముగిసిన పవిత్రోత్సవాలు

విజయవాడ ఆగస్టు 23, (న్యూస్ పల్స్)ఇంద్రకీలాద్రి వెలసిన కనకదుర్గమ్మ గుడిలో పవిత్రోత్సవాలు ముగిశాయి. మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగా యి.నేడు పూర్ణాహుతి కార్యక్రమంలో ఈవో భ్రమరాంబ, ఛైర్మన్ పైలా సోమినాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గగుడి స్థానాచార్యులు వి.శివప్రసాద్ శర్మ మాట్లాడుతూ శ్రావణ మాసంలో పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయతీ అని తెలిపారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని పూజా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. కరోనా నుండి ప్రజలను కాపాడి చల్లగా చూడాలని వేడుకున్నామని శివప్రసాద్ శర్మ అన్నారు.మహా పూర్ణాహుతి కార్యక్రమముతో పవిత్రోత్సవములు దిగ్విజయంగా పరిసమాప్త మయ్యా యని , ఆఖరి రోజున శాంతిక పౌష్టిక హోమము, మహా పూర్ణాహుతి, కలశో ద్వాసన, మార్జన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

## ఇకపై బారి వాహనాలు నిషేధం

__రాక పోకలకు ఇబ్బంది లేకుండా రహదారుల విస్తరణ__

__మాడ వీధుల్లో అల్పాహార బండ్లను ఎత్తి వేయాలి__

__అధికారుల కు ఎమ్మెల్యే ఆర్కే సూచన__

మంగళగిరి ఆగస్టు 23, (న్యూస్ పల్స్) అకస్మాత్తుగా నృసింహుని దక్షిణ గోపురం వైపు ఆలయ ప్రహరి గోడ కూలిపోవటంతో భవిష్యత్ లో ఏ విధమైన ఇబ్బందులూ తలెత్తకుండా పాలకులు చర్యలు చేపట్టారు.ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆర్టీసీ వాహనాలు నిషేధించినట్లుగానే ఇతర వాహనాలనూ పూర్తిగా నిలిపి వేయాలని అధికారులను ఆదేశించారు. ఎవరకెనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలన్నారు.ఆలయం చుట్టూ ఇటీవల అల్పాహార విక్రయ స్టాల్స్ ఎక్కువగా వెలుస్తున్నందున వీటిని అన్నింటినీ పూర్తిగా తొలగించాలని తెలిపారు.రహదారి విస్తరణకు శ్రీకారంనృసింహుని దేవస్థానం గుండా వాహనాలు నిషేధిస్తే ఎదురయ్యే ఇబ్బందుల్ని పరిష్కరించే చర్యల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట రహదారిని నేరుగా జాతీయ రహదారి వరకూ విస్తరించాలన్నారు.ఇందు కోసం స్ట్రీట్ మ్యాప్ పరిశీలించి తక్షణ చర్యలు ప్రారంభించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఈఓ కోటిరెడ్డి, ఆడిషినల్ కమిషనర్ హేమమాలిని తహసీల్దార్ రామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ ప్రమాదం?ఐదుగురికి గాయాలు

కడప ఆగస్టు 23, (న్యూస్ పల్స్) గ్యాస్ డెలివరీ బాయ్ నిర్లక్ష్యం.. ఓ కుటుంబాన్ని ప్రమాదపు అంచుల్లోకి నెట్టేసింది. గ్యాస్ లీకయ్యి అగ్నిప్రమాదం సంభవించి ఐదుగురికి తీవ్రగాయాలయిన ఘటన కడపలో చోటుచేసుకుంది. కర్నూలు జిల్లా నంద్యాల పరిసర ప్రాంతానికి చెందిన కుటుంబం ఉపాధి నిమిత్తం రాజంపేట కు వలస వచ్చి అద్దె ఇంట్లో ఉంటుంది. షేక్ షావలి కూలి పని చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం కొత్తగా గ్యాస్ కనెక్షన్ తీసుకుని ఇంట్లో అమర్చుకునే ప్రయత్నం చేశారు. గ్యాస్ డెలివరీ బాయ్ వారికి ఎలాంటి జాగ్రత్తలు చెప్పలేదు. గ్యాస్ వాడకంలో సరైన అవగాహన లేకపోవడంతో రాత్రంతా గ్యాస్ ఆన్ లోనే ఉండి లీకవుతూనే ఉంది. ఉదయం లేచిన ఇంటివారు లైట్ ఆన్ చే?యడంతో అగ్నిప్రమాదం జరిగింది. షేక్ షావలి, అతని భార్య షేక్ సోఫియా, పిల్లలు ఫైజల్, హనీఫ్ మన్సూర్ లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిలో షేక్ షావలి, మన్సూర్ ల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు సమాచారం. పోలీసు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించిన తర్వాత మెరుగైన వైద్యం కోసం ఐదుగురిని కడప రిమ్స్ కు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## కాకాణి చేతులమీదుగా విభిన్న ప్రతిభావంతులకు సెల్ ఫోన్ల పంపిణీ

నెల్లూరు ఆగస్ట 23, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా, సర్వేపల్లి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సెల్ ఫోన్ లు అందజేశారు. ఈ కార్యక్రమం హాలో నెల్లూరు జిల్లా విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయక సంస్థ సహాయక సంచాలకులు నాగరాజ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఆంధ్ర ప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయక సంస్థ ద్వారా మూగ మరియు చెవుడు 100 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు టచ్ ఫోన్లు అందజేయడం సంతోషకర విషయం అన్నారు.టచ్ ఫోన్ కావాలనుకున్న వారు వంద శాతం వైకల్యం కలిగిన బధిర దివ్యాంగులు ఆంధ్ర ప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సహాయక సంస్థ వెబ్ సైట్ నందు నమోదు చేసుకుంటే, అర్హత కలిగిన వారందరికీ టచ్ ఫోన్లు అందజేస్తామని పేర్కొన్నారు.

## పాదకానుకతో మూల రాములకు స్వర్ణ వజ్ర ఆకు పచ్చ పతకం ,వింధ్యామరల పిడులు చేయించిన పీఠాధిపతులు



మంత్రాలయం ఆగస్టు 23,( విభారె) : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు తనకు పాదకానుకలతో వచ్చిన డబ్బులతో మూల రాములకు స్వర్ణ వజ్ర ఆకు పచ్చని రాయితో తయారు చేసిన హారాన్ని మూల రాములకు సమర్పించారు. సోమవారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలలో భాగంగా పూర్వారాధనను పురస్కరించుకుని మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించిన అనంతరం హారాన్ని మూల రాముల మూర్తికి అలంకరించారు. పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ద్వారా భక్తులు ఆశిస్సులు పొందిన సమయంలో వేసిన కానుకలతో భక్తులు పాదపూజ చేసిన సమయంలో వచ్చిన కానుకలను సమీకరించిన ఆయన పవిత్ర ఆశయంతో సంకల్పించి ఈ స్వర్ణ వజ్ర పచ్చని రాయి గల హారాన్ని రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు సమర్పించారు. అత్యంత విలువైన ఈ హారాన్ని పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు తానే స్వయంగా తయారు చేయించి మూల రాములకు సమర్పించడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా తమకు చెందిన పాదకానుకల ద్వారా వింధ్యామరల పిడులు చేయించిన ఆయన స్వలాభాపేక్ష లేకుండా ఇంతటి ఖరీదైన హారం మూల రాములకు సమర్పణతో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ప్రత్యేకతను చాటుకున్నారు.

## గ్రామ అభివృద్ధి కి సహకరిస్తామని వైసీపీ నాయకులు నాకేశ్ రెడ్డి

### గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే వరకు కృషి చేస్తాం

కౌతాళం ఆగస్టు 23,( విభారె) : బదినేహాల్ గ్రామమును ఆదర్శ గ్రామముగా తీర్చు దిద్దుతామని గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని వైసీపీ నాయకులు నాకేశ్ రెడ్డి ఉదయం న్యూస్ రిపోర్టర్ తో పేర్కొన్నారు.వారు మాట్లాడుతూ త్వరలో ఎమ్మెల్యే బలనాగి రెడ్డి సహకారంతో గ్రామనికి పెద్ద సమస్య నీటివాసతులు కల్పించి, డ్రైనేజీ వ్యవస్థ కరెంట్ సమస్యలు పరిష్కరిస్తానని గ్రామ ప్రజలకు హామి ఇచ్చారు. సోమవారం బదినేహాల్ గ్రామానికి విచ్చేసి రైతు భరోసా కేంద్రం కు భూమి పూజ లు ,పచ్చ తోరణం కార్యక్రమంలో పాల్గొని ఏరిగేరి గ్రామం వరకు చెట్లు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందు ముందు గ్రామ సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రైతు భరోసా కేంద్రం ను మూడు నెలల్లో నిర్మించి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కాలనీల్లో సీసీ రోడ్లు లేని దగ్గర సీసీ రోడ్లు నిర్మిస్తామని గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ అధికారులు సేవలు అందించాలని సూచించారు.

# స్వామి సన్నిధిలో భక్తులు శ్రావణ మాసం మూడవ సోమవారం పూజలు



కౌతాళం ఆగస్టు 23,( విభారె) ప్రముఖ పుణ్య క్షేత్రము అయిన ఈరన్న స్వామి శ్రావణ మాసం మూడవ సోమవారం విశేష దినోత్సవం సందర్భంగా భక్తులు తరలి వచ్చారు. కోరిన వారికి కోరికలు నెరవేర్చే కొలిచే కొంగు బంగారం ఈరన్న స్వామి. భక్తుల పాలిట కోరిన కోర్కెలు తీర్చే కల్ప వృక్షం స్వామి వారి విశేష దినోత్సవన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్ ను

స్వామివారి ఆలయంలో రద్దీ తగ్గిన భక్తుల సందడి
భక్తులు లేక వెలవెల బోయిన వ్యాపారస్తులు
భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు సేవలు
అపరిశుభ్రం లోపించకుండా కార్మిక సిబ్బంది సేవలు

పూలు వెండి ఆభరణాలు తో అలంకరించారు. ఉదయం ఏడు గంటల సుప్రభాత సేవ నుంచి రాత్రి ఏడు గంటల వరకు మంగళ హారతి నిర్వహించరు. ప్రత్యేక రుసుము చెల్లించి అనుమతి పొందిన భక్తుల సమక్షంలో ఎనిమిది నుంచి పది వరకు అవినేటి మండపంలో స్వామి వారికి పంచామృత అభిషేకలు సాయంత్రం ఆరు నుంచి ఏడూ వరకు ధ్వజ స్థంభం వద్ద ప్రకరోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి మహా నైవేద్యాన్ని సమర్పించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి దర్శననికి వచ్చిన భక్తలకు అన్ని రకాల వసతులు ఆలయ అధికారులు కల్పించారు.దర్శన భాగ్యం ఉదయం 7 నుంచి సాయంత్రం 7గంటల వరకు ఉండటం వల్ల అధిక సంఖ్యలో భక్తులు దర్శన భాగ్యం కలగకుండా వెనుదిరిగారు. బయట నుంచే దేవుని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. అవాంచనీయ సంఘటనలు కలగకుండా,సీఐ, పార్థ సారథి , ఎస్ ఐ మన్మధ విజయ్ ఆధ్వర్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు.

# ఉపాధి హామీ లో పెండింగ్ బకాయిలు వేతనాలు చెల్లించాలి

## ఆవ్వుల శేఖర్



డోన్ ఆగస్టు 23,( విభారె): ఉపాధి హామీ లో పెండింగులో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి అనీ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంగమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవుల శేఖర్ డిమాండ్ చేస్తున్నారు, స్థానిక డోన్ మండలం ఉడుములపాడు గ్రామంలో సచివాలయం వద్ద ధర్నా ధర్నా కార్యక్రమంలో అవుల శేఖర్ పాల్గొన్నా సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మికసంఘం బికెయంయూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గ పరిధిలో ఉడుములపాడు గ్రామ సచివాలయం దగ్గర ధర్నా కార్యక్రమం తాలూకా అధ్యక్షులు, వరదరాజులు, కార్యదర్శి నారాయణ నాయకత్వన జరిగింది. ఈ ధర్నా ముఖ్య అతిధి గా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీలో పెండింగ్ బకాయి పడ్డ వేతనాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలల్లో ప్రభుత్వమే గృహాలు నిర్మించి ఇవ్వాలని, కోనేరురంగారావు భూ కమిటీ సిఫార్సులను నవరత్నాలు చేర్చి భూమిలేని పేదలకు 2 ఎకరాలు భూమి ఇవ్వాలని, రేషన్ కార్డు లో ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు ఎటువంటి నిబంధనలు పెట్టకుండా అమలు చేయాలని, వ్యవసాయంలో యంత్రాలను నియంత్రించి వ్యవసాయ కూలిలతో పనులు చేయించుకునేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. వై యస్ జగన్ అధికారం లోకి వచ్చే ముందు నవరత్నాలు పెట్టుకొని ప్రచారం చేసి అధికారం లోకి వచ్చాడని, సంక్షేమ పథకాలు అమలు మంచిదే నని వాటిని వ్యవసాయ కార్మిక సంఘం స్వాగతిస్తున్నదని అన్నారు. కాని ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో పక్కా గృహాలు 4 లక్ష లతో కట్టించి ఇవ్వాలని ఆయన కోరారు. ఉపాధి లో పెండింగ్ లో వున్న బకాయి వేతనాలు వెంటనే ఉపాధి కూలీలకు ఇవ్వాలన్నారు.కోనేరు రంగారావు భూ కమిటీ సిఫారసులను వెంటనే నవరత్నాల్లో చేర్చి భూమి లేని ప్రతి పేదకుటుంబానికి 2 ఎకరాలు ఇవ్వాలని, రాష్ట్రము లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని అన్నారు. రేషన్ కార్డు ఆధారంగా ఒక్కరికే పెన్షన్ అనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మానుకోవా లన్నారు. సంక్షేమ పథకాలు పేదవాళ్లకు అందరికి అందాలని అనవసరమైన నిబంధన లు పెట్టవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల కాలనీల్లో కనీసవసతులు ఏర్పాటు చేసి పేదలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏ ఐ వై యఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ, డోన్ నియోజకవర్గ సి పి ఐ కార్యదర్శి రంగనాయుడు, ఏ ఐ వై యఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిశేఖర్,బొంతిరాళ్ల సర్పంచ్, న్యాయవాది రవిమోహన్, ఉడుములపాడు గ్రామ కార్యదర్శి మధు, మద్దయ్య, తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమం లో వివిధ గ్రామాల ఉపాధి కూలీలు, పేదలు పాల్గొన్నారు.అనంతరం సచివాలయం కార్యదర్శి కి మెమోరాండం సమర్పించడం జరిగింది

## సెప్టెంబర్ మొదటి వారంలో భక్తులకు అందుబాటులో టిటిడి అగర బత్తులు

### పంచగవ్య ఉత్పత్తులపై ఈ నెలలోనే ఒప్పందం
### టిటిడి ఈవో డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి

తిరుమల,ఆగస్టు 23,( విభారె) : టిటిడి ఆలయాల్లో ఉపయోగించిన పూల మాలలతో తయారు చేసే పరిమళభరితమైన అగర బత్తులు సెప్టెంబర్ మొదటి వారంలో భక్తులకు అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేయాలని టిటిడి ఈవో డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టిటిడి పరిపాలన భవనంలోని తన చాంబర్లో సోమవారం గో సంరక్షణ శాల, ఆయుర్వేద కళాశాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన దర్శన్ సంస్థ సహకారంతో ఈ అగర బత్తులను తయారు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీవారి భక్తులకు ఆకర్షణీయమైన డిజైన్లతో రూపొందించిన ఏడు రకాల బ్రాండ్లతో తయారు చేసిన అగర బత్తులు సెప్టెంబర్ మొదటి వారంలో విక్రయించడానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తిరుమలలో లడ్డూ కౌంటర్ల వద్ద, కొబ్బరికాయల కౌంటర్ వద్ద, గోశాల వద్ద, అదేవిధంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయం, విష్ణునివాసం, శ్రీనివాసంలలో భక్తులకు అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఈవో పంచగవ్య ఉత్పత్తులపై సమీక్షించారు. కొయంబత్తురుకు చెందిన ఆశీర్వాద్ సంస్థ సహకారంతో ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ 15 రకాల పంచగవ్య ఉత్పత్తులు చేయనున్నట్లు తెలిపారు. ఈ ఉత్పత్తులకు సంబంధించి ఈ నెలలోనే విధివిదానాలు రూపొందించాలన్నారు. ఇందుకోసం డిపిడబ్ల్యు స్టోర్స్‌లో అవసరమైన సివిల్, ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంచగవ్య ఉత్పత్తులకు సంబంధించి లైసెన్స్, ప్యాకింగ్, మార్కెటింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పంచగవ్య ఉత్పత్తులైన దివ్య మంగళ - ధూప్‌చూర్ణం, అగరబత్తీలు, సాంబ్రాణి కప్‌లు, ధూప్ స్టిక్స్, ధూప్ కోన్‌లు, ఐశ్వర్య - విబూది, పరిమళ - హెర్బల్ టూత్ పౌడర్, ఫేస్‌ప్యాక్, సోప్, షాంపూలు, సంజీవని - నాశల్ డ్రాప్స్, గో తీర్థ్ - గో ఆర్క్, పావని - హెర్బల్ ఫ్లోర్ క్లీనర్, గోపాల - ఆవు పేడ కేక్, ఆవు పేడ దుంగలు తదితర వాటిని సిద్ధంచేయాలన్నారు. ఎఫ్ఏ అండ్ సిఏవో శ్రీ బాలాజి, చీఫ్ ఇంజినీర్ శ్రీ నాగేశ్వరరావు, ఎస్వీ డైరీఫామ్ డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ సమావేశంలో పాల్గొన్నారు.

## పోడు పట్టాలివ్వాలని సీపీఎం ధర్నా

అరకులోయ మండలం చినలబడు పంచాయతీ 14 గ్రామాల్లో పోడుపట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజనులకు పొడుపట్టలు మంజూరుచేసి పంపిణి చెయ్యాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చినలబడు సచివాలయంలో నిరసన తెలియజేసి విన్నతిపత్రం అందజేశారుసీపీఎం నాయకులు పి బాలదేవ్ మాట్లాడుతూ చినలబడు పంచాయతీ లో 2020 సంవత్సరంలో పొడుపట్టాలు ఇవ్వాలని 602 దరఖాస్తులు చేసుకున్నారని,370 మందికి పట్టాలు మూడువిడుతల్లో పంపిణీ చేస్తామని ప్రకటించి 120 పట్టాలు మాత్రమే ఇచ్చారని మిగిలినవారి అనేక సాకులు చూపించి పట్టాల పంపినిచెయ్యడంలేదని, వి యస్ యస్ రద్దు చేశామని సాగులో గిరిజనరైతులకు పట్టాలిస్తామని ప్రభుత్వం ప్రకటిందని కానీ నేటికీ పూర్తిస్థాయిలో జీ పీ యస్ సర్వేలకుడా జరగలేదని, ప్రభుత్వం,ప్రభుత్వాధికారులు తక్షణమే స్పందించి గిరిజనరైతులకు పొడుపట్టాలు పంపిణీ చేయాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని తెలియజేస్తున్నాం.

# భోళా శంకర్ తో స్టైలిష్ డైరెక్టర్ ఈజ్ బ్యాక్




ప్రభాస్ తో బిల్లా సినిమాను చాలా స్టైలిష్ గా తెరకెక్కించి స్టైలిష్ డైరెక్టర్ గా పేరు దక్కించుకున్న మెహర్ రమేష్ చివరి సినిమా షాడో వచ్చి ఎనిమిది ఏళ్లకు పైగా అయ్యింది. షాడోకు ముందు శక్తి సినిమాను తెరకెక్కించి డిజాస్టర్ చవి చూశాడు. శక్తి మరియు షాడో సినిమాలు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్ అవ్వడంతో మెహర్ రమేష్ మళ్లీ కనిపించకుండా పోయాడు. ఇండస్ట్రీలో ఆయనకు ఉన్న పరిచయాలు మరియు స్నేహాల కారణంగా సినిమాలకు దర్శకత్వం చేయకున్నా కూడా పెద్ద సినిమాల బ్యాక్ ఎండ్ వర్క్ ను ఆయనే చూసుకునేవాడు అంటూ వార్తలు వచ్చాయి. మహేష్ బాబు సినిమాలతో పాటు మెగా హీరోల సినిమాలకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ల్లో మెహర్ రమేష్ హ్యాండ్ ఎంతో కొంత అయినా ఉండేది అంటూ టాక్.మహేష్ బాబుకు ఆప్తుడిగా.. మెగా ఫ్యామిలీకి సన్నిహితుడిగా ఉన్నా కూడా రీ ఎంట్రీకి దాదాపుగా ఎనిమిది సంవత్సరాలు తీసుకున్న మెహర్ రమేష్ ఎట్టకేలకు మెగా స్టార్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్దం అయ్యాడు. మెగా స్టార్ సినిమా భోళా శంకర్ తో రీ ఎంట్రీ ఇవ్వబోతున్న మెహర్ రమేష్ పై ప్రేక్షకులు ఈసారి చాలా నమ్మకంగా ఉన్నారు. ఆయన పాత సినిమాల గురించి పూర్తిగా మర్చి పోయి చిరంజీవితో ఒక మంచి సినిమాను చేస్తాడనే నమ్మకంతో వెయిట్ చేస్తున్నారు. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా భోళా శంకర్ సినిమాకు సంబంధించిన మోషన్ పోస్టర్.. చిరంజీవి ఇంకా కీర్తి సురేష్ ల రాఖీ స్పెషల్ ఫస్ట్ గ్లింప్స్ ఇంకా టైటిల్ అన్ని విధాలుగా కూడా మెహర్ రమేష్ ఖచ్చితంగా మంచి సినిమాను అందించబోతున్నాడు అంటూ అభిమానులు నమ్మకంతో ఉన్నారు.చిరంజీవి బర్త్ డే సందర్భంగా ఆచార్య మరియు గాడ్ ఫాదర్ చిత్రాల కంటే కూడా అధికంగా భోళా శంకర్ సినిమా గురించి సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తమిళ సూపర్ హిట్ మూవీ వేదాళంకు ఇది రీమేక్ అయినా కూడా చాలా మార్పులు ఉండబోతున్నట్లుగా చెబుతున్నారు. బిగ్ బాస్ బ్యూటీ దివి ని కీలక పాత్ర కోసం తీసుకున్నారు. పెద్ద ఎత్తున అంచనాలున్న ఈ సినిమాను అతి త్వరలోనే పట్టాలెక్కించబోతున్నారు. రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లతో ఈ సినిమా సక్సెస్ దక్కించుకుంటుందని.. ఈ సినిమా తో మెహర్ రమేష్ మళ్లీ టాలీవుడ్ లో బిజీ అవ్వడం ఖాయం అన్నట్లుగా నెటిజన్స్ నమ్మకంతో ఉన్నారు. మహేష్ బాబుకు మెహర్ రమేష్ అత్యంత ఆప్తుడిగా పేరు దక్కించుకున్నాడు. కనుక భోళా శంకర్ సినిమా సక్సెస్ అయితే మరే ఆలోచన లేకుండా మెహర్ రమేష్ తో సినిమాను చేసేందుకు మహేష్ బాబు ఓకే చెప్పే అవకాశాలు క్లియర్ గా ఉన్నాయి. కనుక స్టైలిష్ డైరెక్టర్ ఈజ్ బ్యాక్ అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.తెలుగు సినిమా ఆంధ్రావాలను కన్నడంలో రీమేక్ చేసిన మెహర్ రమేష్ ఆ తర్వాత ఒక్కడు సినిమాను కూడా కన్నడంలో రీమేక్ చేశాడు. క్రాంతి తో తెలుగు లో ఎంట్రీ ఇచ్చిన మెహర్ రమేష్ ఆ తర్వాత బిల్లా సినిమాను చేశాడు. బిల్ల సూపర్ హిట్ అయ్యింది. ఇప్పటి వరకు మెహర్ రమేష్ రీమేక్ చేసిన సినిమాలు అన్ని కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. కనుక వేదాళం కు రీమేక్ గా రూపొందుతున్న భోళా శంకర్ సినిమా కూడా సెంటిమెంట్ ప్రకారం సక్సెస్ అవ్వడం ఖాయం అంటూ అభిమానులు ధీమాతో ఉన్నారు. వచ్చే ఏడాదిలో భోళా శంకర్ ప్రేక్షకుల ముందుకు వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.

# 'నాంది' బ్యానర్ లో బెల్లంకొండ గణేష్ సినిమా



బెల్లంకొండ సురేష్ పెద్ద కుమారుడు సాయి శ్రీనివాస్ ఇప్పటికే యాక్షన్ హీరోగా రాణిస్తున్న సంగతి తెలిసిందే. రాక్షసుడు చిత్రంతో బ్లాక్ బస్టర్ కొట్టి వరుస చిత్రాలకు సంతకాలు చేశాడు. ప్రస్తుతం హిందీలో ఛత్రపతి రీమేక్ లో నటిస్తున్న సంగతి విధితమే. అతడి సోదరుడు బెల్లంకొండ గణేష్ హీరోగా లక్కీ మీడియా - దిల్ రాజు కలయికలో ఓ సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. పవన్ సాధినేని దర్శకుడిగా ఇది మొదలైంది. ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ చిత్రాలకు సంతకాలు చేస్తున్నాడు.నేడు బ్లాక్ బస్టర్ 'నాంది' చిత్రాన్ని నిర్మించిన బ్యానర్ ఎస్వీ2 ఎంటర్ టైన్ మెంట్స్ లో గణేష్ నటించే మూడో సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రానికి రాకేష్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్నారు. దిల్ రాజు క్లాప్ కొట్టి ప్రారంభించగా అల్లరి నరేష్ కెమెరా స్విచ్చాన్ చేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ గణేష్-లిరిసిస్ట్ కృష్ణచైతన్య సహా చిత్రబృందం పాల్గొన్నారు.ఇది న్యూ ఏజ్ థ్రిల్లర్ జానర్ అని చిత్రబృందం వెల్లడించింది. ప్రముఖ దర్శకుడు తేజ శిష్యుడు రాకేశ్ ఉప్పలపాటి ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ న్యూ ఏజ్ థ్రిల్లర్ కు రాకేశ్ స్క్రీన్ ప్లే రాయగా కథను అందించిన ప్రముఖ రచయిత కృష్ణ చైతన్య మాటలు పాటలను కూడా రాస్తున్నారు. వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం అవుతుంది. మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి అనిత్ సినిమాటోగ్రాఫర్. ఛోటా కె.ప్రసాద్ ఎడిటర్. అన్నయ్య బెల్లంకొండ శ్రీనివాస్ స్టైల్లోనే గణేశ్ కూడా కెరీర్ ప్రారంభంలోనే వైవిధ్యమైన చిత్రాలను ఎంపిక చేసుకుంటున్నారు.

# హోల్ సేల్ గా లేపేసే చోట పార్కింగ్ చేస్తే!

యంగ్ హీరో సుశాంత్ ఇటీవల 'అల వైకుంఠపురములో' చిత్రంలో ఓ కీలక పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అతడు నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా సెన్సార్ సహా అన్ని ఫార్మాలిటీస్ ని పూర్తి చేసుకుంది. ఈ నెల 27 న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రం ప్రమోషన్స్ లో టీమ్ వేగం పెంచింది. తాజాగా కింగ్ నాగార్జున థియేట్రికల్ ట్రైలర్ ను విడుదల చేసారు.ఆసక్తికరమైన కథ కథనంతో ట్రైలర్ ఆద్యంతం రక్తి కట్టించింది. ఇది అన్ని కమర్షియల్ అంశాలతో రంజింపజేసే పూర్తి ప్యాకేజీ సినిమా. అతని మొదటి సినిమా అయినా దర్శకుడు ఎస్ దర్శన్ ఈ చిత్రాన్ని చాలా గ్రిప్పింగ్ గా తెరకెక్కిస్తున్నారని అర్థమవుతోంది.ఇది నిజఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న సినిమా. క్రైమ్ సస్పెన్స్ థ్రిల్ లవ్ ఇలా అన్ని అంశాల మేలు కలయికగా కనిపిస్తోంది. హీరో సుశాంత్ ను ఇబ్బందుల్లోకి నెట్టిన సంఘటన ఏమిటో క్లారిటీగా చూపించకపోయినా.. అతడు చిక్కుల్లో పడతాడన్నది అర్థమవుతోంది. హోల్ సేల్ గా లేపేసే గూండాలతో అతడి సమస్య ఏమిటన్నది తెరపైనే చూడాలి. ఈ ట్రైలర్ సినిమా కథాంశాన్ని ఆవిష్కరిస్తుంది. ఒక కాలనీలో గందరగోళం జరుగుతుంది. అప్పటి వరకు సంతోషకరమైన జీవితాన్ని గడిపిన సుశాంత్ తరువాత గూండాలు పోలీసుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. మీనాక్షి చౌదరి అతడి స్నేహితురాలుగా కనిపించనుంది

# సెంటి మీటర్ తేడాతో స్వర్ణం చేజారె!




లాంగ్‌జంప్‌లో శైలీ సింగ్‌కు రజతం
ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

నైరోబి: ఒకే ఒక సెంటిమీటర్ దూరం భారత అథ్లెట్ శైలీ సింగ్‌ను స్వర్ణానికి దూరం చేసింది. ప్రపంచ జూనియర్ అథ్లెటిక్స్ (అండర్?20) చాంపియన్‌షిప్‌లో ఆమె రజతం గెలిచినా... వెంట్రుకవాసిలో పసిడి దక్కకపోవడమనేది అథ్లెట్‌ను బాగా నిరాశపరిచే అంశం. కెన్యా రాజధానిలో ఆదివారం ముగిసిన ఈ జూనియర్ మెగా ఈవెంట్‌లో లాంగ్‌జంపర్ శైలీ ఆదివారం ఫైనల్స్‌లో అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన కనబరిచింది. మొత్తం 12 మంది పోటీపడిన మహిళల లాంగ్‌జంప్ ఫైనల్లో స్వీడన్‌కు చెందిన మజ అస్కగ్ 6.60 మీటర్ల దూరం దూకి బంగారు పతకం సాధించింది. భారత లాంగ్‌జంపర్ శైలీ కూడా తానేం తక్కువ కాదని 6.59 మీటర్ల దూరం దూకింది. అర అంగుళం కంటే తక్కువ తేడాతో బంగారాన్ని కోల్పోయింది. తొలి, రెండో ప్రయత్నంలో ఆమె 6.34 మీ. దూరాన్ని నమోదు చేసింది. రెండో ప్రయత్నం ముగిసే సరికి హ్వారియెలొవా (6.50 మీ.; ఉక్రెయిన్) ఆధిక్యంలో నిలువగా, ఎబొసెలె (6.46మీ.; స్పెయిన్), శైలీ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మూడో ప్రయత్నం (6.59 మీ.) శైలీని స్వర్ణావకాశానికి దగ్గర చేసింది. అప్పటికి అస్కగ్ (6.44 మీ.) పతకం బరిలోకి రానేలేదు. కానీ నాలుగో ప్రయత్నం అస్కగ్ (6.60 మీ.)ను చాంపియన్‌గా చేస్తే, భారత అథ్లెట్ 4, 5 ప్రయత్నాలు ఫౌల్ అయ్యాయి. ఆఖరి ఆరో ప్రయత్నం సఫలమైనా... 6.37 మీటర్ల దూరమే దూకింది. దీంతో చివరకు రజతమే ఖాయమైంది. ఉక్రెయిన్ అథ్లెట్ మరియనా హ్వారియెలొవా (6.50 మీ.) కాంస్యం గెలిచింది.తెలుగమ్మాయి కుంజా రజిత భాగంగా ఉన్న 4 చీ 400 మీటర్ల రిలేలో భారత జట్టుకు నాలుగో స్థానం దక్కింది. మహిళల ఫైనల్లో రజిత, ప్రియా మోహన్, పాయల్ వోహ్రా, సమ్మిలతో కూడిన జట్టు పోటీని 3 నిమిషాల 40.45 సెకన్లలో పూర్తి చేసింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190